ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 13, మే 2025

ఒక్కరోజు.. ముగ్గురు మంత్రులు.. నాలుగు కార్యక్రమాలు

ఇన్‌చార్జి మంత్రి ఆనం నేతృత్వంలో డీఆర్సీ సమావేశం

- తాగునీటి ఇక్కట్లు, ఉపాధి పథకంలో లోపాలపై చర్చ
- పొగాకు మార్కెట్‌పై మంత్రులు గొట్టిపాటి, డోలా సమీక్ష
- రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి
- బిజీబిజీగా కీలక ప్రజాప్రతినిధులు

ఒంగోలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రమైన ఒంగోలులో సోమవారం కీలక ప్రజాప్రతినిధులు ప్రత్యేకించి అధికార పార్టీకి చెందిన వారు రోజంతా బిజీబిజీగా గడిపారు. ఏకంగా ముగ్గురు మంత్రులతోపాటు జిల్లా నుంచి వివిధ చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్య ప్రజాప్రతినిధులంతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డీఆర్సీ సమావేశం అనంతరం అదే హాలులో ప్రస్తుత పొగాకు మార్కెట్ తీరుపై ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సమీక్షించారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ విశ్వశ్రీలతోపాటు ప్రధానమైన పొగాకు కంపెనీల ప్రతినిధులు, వివిధ వేలంకేంద్రాల రైతుప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మార్కెట్లో ధరలు, వ్యాపారుల తీరుపై రైతు ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గిట్టుబాటు


పొగాకు రైతు సమస్యలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన మరో మంత్రి స్వామి

ధరలతోపాటు వేగంగా కొనుగోలు చేయాల్సిన అవసరాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. తమకు ఉన్న ప్రతికూల పరిస్థితులను కంపెనీల ప్రతినిధులు వివరించారు. రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు చేయాలని మంత్రులు సూచించారు. అందుకు బోర్డు అధికారులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఉదయం ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడు వద్ద టీడీపీ నేత, హర్షిణి విద్యాసంస్థల అధిపతి గోరంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మహిళా ఇంజనీరింగ్ కాలేజీని మంత్రులు గొట్టిపాటి, స్వామి ప్రారంభించారు. అనంతరం స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలో నూతనంగా రూ.కోటితో నిర్మించిన దేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా కార్యాలయాన్ని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ స్వామి ప్రారంభించారు. మంత్రుల కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, దామచర్ల, సత్య, నూకసాని బాలాజీ, కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. అలాగే డీఆర్సీ సమావేశానికి వైసీపీకి చెందిన జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌లు కూడా హాజరై తమ ప్రాంత సమస్యలను ఏకరువు పెట్టారు. టీడీపీ దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, గుడూరి ఎరిక్షన్‌బాబుకూడా పాల్గొన్నారు.


డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం, వేదికపై మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా, హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు

అంతా.. ఏకరువు

తాగునీటి సమస్యపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

అన్నింటినీ వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి
అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి మంత్రి ఆనం

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన

ఆరు మాసాల అనంతరం జరిగిన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశంలో సమస్యలపై ఎమ్మెల్యేలు గళమెత్తారు. పరిమితంగా కేవలం ఉపాధి, తాగునీరు, పీఎం సూర్యఘర్, హౌసింగ్, ప్రజావినతుల పరిష్కారం అంశాలపై సమీక్షించారు. ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు వేసవిలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య, ఉపాధి అమలులో క్షేత్రస్థాయిలో లోటుపాట్లను ఏకరువు పెట్టారు. ప్రధానంగా పశ్చిమప్రాంత ప్రజాప్రతినిధులు తాగునీటి ఎద్దడిని సమావేశం దృష్టికి తెస్తూ వేసవిలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలనూ వివరించారు. ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ఎత్తిచూపారు. వీటిపై ఇన్‌చార్జి మంత్రి ఆనం, జిల్లాకు చెందిన మంత్రి స్వామిలు సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత వేసవిలో నెలకొన్న తాగునీటి సమస్యను ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. ప్రజల గొంతులు తడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్సీ సమావేశం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. అందులో ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై గళమెత్తారు. ప్రధానంగా తాగునీటి ఇబ్బందులను ప్రస్తావించారు. రక్షిత పథకాలను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. తాగునీటి సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ప్రస్తుతం నీటిని తోలేందుకు ముందుకు రావడం లేదన్నారు. అందువల్ల సత్వరమే బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నిధుల లభ్యత, తాగునీటి పథకాల మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపాలన్నారు. గడచిన ఐదేళ్లలో జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం నీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొళాయిల ద్వారా నీటిని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాగునీటి పథకాలను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం

రైతులకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని మంత్రి ఆనం తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఉపాధి పథకం ద్వారా కూలీలకు పనుల కల్పనతోపాటు సకాలంలో వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో తొలుత ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కలెక్టర్ అన్సారియా. మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం

- అవసరమైతే పంచాయతీ నిధుల వినియోగం
- అన్నివర్గాలకూ సంక్షేమ ఫలాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

7

అన్నిరంగాల అభివృద్ధికి చర్యలు



జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తాం. జిల్లాలో పంట కుంటల నిర్మాణాలను పెద్దఎత్తున చేపడుతున్నాం. మూగజీవాలకు కూడా తాగునీటిని అందించే లక్ష్యంతో ఉపాధి పథకం ద్వారా పెదెత్తున నీటితొట్టెల నిర్మాణాలను చేపడుతున్నాం.

- డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి



జిల్లాలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ పనులు క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలి. ఒంగోలు నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలను అభివృద్ధి చేసేందుకు నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ పరిశీలన చేస్తోంది.

- మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ

పంచ ప్రాధాన్యత కింద ఉపాధి హామీ పనులు



జిల్లాలో పంచ ప్రాధాన్యత కింద ఉపాధి పనులు ముమ్మరంగా చేపడుతున్నాం. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- తమీమ్ అన్సారియా, కలెక్టర్

థ్యాంక్యూ సర్..

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డీసీఎంఎస్ చైర్మన్ పీఠం దక్కించుకున్న శ్యామల కాశిరెడ్డి సోమవారం ఒంగోలులోని ఎంపీ మాగుంట కార్యాలయంలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిశారు. ఆయనకు జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారు.



ఆలయాల అభివృద్ధే ధ్యేయం

- నిర్మాణం, పునరుద్ధరణకు రూ.100 కోట్లు
- అర్చకులు, నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు జీతం పెంపు
- గత నెల నుంచి వేదపండితులకు సంభావన కింద రూ.3 వేలు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ఒంగోలులో ఆ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

6


ధర్నాలో పాల్గొని నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

స్పష్టత లేని సర్దుబాటుతో టీచర్లలో ఆందోళన


ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు
- ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్పష్టమైన ఉత్తర్వులు లేకుండా రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరినీ ఆందోళనకు గురిచేస్తున్నదని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ఆరోపించారు. 117 జీవోను రద్దుచేసి కొత్త జీవోను విడుదల చేసి పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల సర్దుబాటు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగోన్నతులు తదితర సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారంవారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాఠశాల విద్య కమిషనర్ సమావేశాలు నిర్వహించినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. టీచర్ల ఉద్యోగోన్నతుల జాబితాల్లో తప్పులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనే నియమించాలన్నారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై, నాయకులు ఐ.వి.రామిరెడ్డి, జి. ఉమా మహేశ్వరి, చిన్నస్వామి, డి.రాజశేఖర్, పి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీను, టి.రమణారెడ్డి, సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు నోటీసు అందించిన టీడీపీ మార్కాపురం కౌన్సిలర్లు
- మంత్రులను కలిసి పరిస్థితిని వివరించిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసును టీడీపీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. ఉదయం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కౌన్సిలర్లు అందరూ కలిసి వాహనాల్లో ఒంగోలు తరలి వెళ్లారు. అక్కడ తొలుత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీలో చోటు చేసుకున్న తాజా పరిస్థితులను వారికి వివరించారు. పట్టణం అభివృద్ధి దృష్ట్యా వైసీపీ పాలకవర్గాన్ని మార్చాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం ప్రకాశం భవన్‌కు చేరుకుని అక్కడ డీఆర్సీ సమావేశానికి వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అవిశ్వాస నోటీసును ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి 17 మంది కౌన్సిలర్లు అందజేశారు. అన్ని ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించి అవిశ్వాసంపై తేదీని ప్రకటిస్తామని వారికి కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, మయూరి ఖాశిం, 17 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు

దోర్నాలలో నీటి కష్టాలు

- ట్యాంకర్లతో అరకొర సరఫరా
- సిగపట్లు పడుతున్న మహిళలు
- వనరులున్నా వినియోగంలోకి తేని అధికారులు

7




విలపిస్తున్న బాధితురాలు కుమారి

ప్రయాణికురాలి సంచి కోసి 20 సవర్ల నగలు అపహరణ

- రూ.37వేల నగదు కూడా చోరీ
- బాధితురాలిది తాళ్లూరు మండలం తూర్పుగంగవరం
- విక్కిరాలపేట వెళ్తుండగా కొండపి బస్టాండ్‌లో ఘటన

కొండపి, మే 12 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలి బ్యాగ్‌ను కోసి అందులో ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.37వేల నగదును అపహరించుకెళ్లారు. ఈ ఘటన కొండపి బస్టాండ్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన గుట్టపల్లి కుమారి కందుకూరు మండలం విక్కిరాలపేటలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. అందులో భాగంగా కొండపికి చేరుకున్నారు. విక్కిరాలపేటకు వెళ్లే బస్సు ఉదయం 9.30 గంటలకు బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ ఉన్న ప్రయాణికులతోపాటు కుమారి కూడా బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా చేతిలోని సంచి బరువు తగ్గి అందులోని చీరలు బయటకు వచ్చాయి. అనుమానంతో సంచిని చూడగా అది కోసి ఉంది. దానిలో 20సవర్ల బంగారు ఆభరణాలు, రూ.37,00 నగదు ఉంచిన పర్సు కనిపించలేదు. దీంతో విలపిస్తూ ఆమె పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. కొండపి బస్టాండ్‌లో తాను బస్సు కోసం వేచి ఉన్నప్పుడు ఒడిలోనే సంచిని ఉంచుకున్నానని, బస్సు ఎక్కేటప్పుడే ఎవరో దాన్ని కోసి పర్సును తీసుకున్నారని వాపోయారు. ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా
దంపతులకు గాయాలు

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద కందుకూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆటో బోల్తా పడిన ఘటన సోమవారం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు దేవా,సుస్మితలకు గాయాలయ్యాయి. వారిద్దరిని హైవే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గాయపడిన భార్యా భర్తలు కందుకూరుకు చెందినవారు.వారు వ్యక్తిగత పనులు నిమిత్తం చిలకలూరిపేట వెళుతుండగా ప్రమాదం జరిగింది.

ప్రకృతి వ్యవసాయంతో
రైతులకు మేలు

అవగాహన సదస్సులో ఏడీఏ మోహనరావు

ఇంకొల్లు, మే 12, (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు పండించినట్లయితే లాభాలు పొందవచ్చునని పర్చూరు ఏడీఏ మోహన రావు అన్నారు. మండలంలోని ఇడుపుల పాడులో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మగ్గు చూపాలన్నారు. ఈ పద్దతిలో పండించిన ఆహారం తినడం వలన ఆరోగ్యంతో పాటు లాభాలు పొందవచ్చునన్నారు. భావిత రాలకు మంచి వ్యవసాయభూమిని అందజే యాలన్నారు. రసాయన ఎరు వులతో వచ్చే అనర్థాలను వివరించారు. మహిళలు పెరటి తోటలు ప్రకృతి వ్యవసాయ విధానంతో చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంద న్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కె టింగ్ ధ్రువీకరణపత్రం అందజేస్తారని ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టిన సుబ్బారావు, జక్రయ్య, సులోచన, శ్రీకాంత్, రాంబాబు, అంజయ్య, శ్రీనివాసరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్,సర్పంచ్ బండారు సుమతి, రైతులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

- ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణకు రూ.100 కోట్లు
- అర్చకులు, నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు జీతం పెంపు అమలు
- గత నెల నుంచి వేదపండితులకు సంభావన కింద రూ.3 వేలు
- దూపదీపనైవేద్యాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ఒంగోలులో ఆ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఆనం, స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, మేయర్ సుజాత

ఒంగోలు కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, అందుకోసం రూ.100 కోట్లు కేటాయించామని దేవదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఒంగోలులోని రంగారాయుడు చెరువు దగ్గర కోటి రూపాయలతో నిర్మించిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, అధికారులు పాల్గొనగా వారికి వేదపండితుల పూర్ణకుంభతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రతి జిల్లాలో దేవదాయ శాఖకు స్వంత కార్యాలయం ఏర్పాటు చేయాలనేది సీఎం చంద్రబాబు నిర్ణయమని, ఇందుకు అనుగుణంగా ఇటీవల నెల్లూరులో సైతం కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. తమ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వంలో రూ.5 వేలుగా ఉన్న ధూపదీప నైవేద్యాల మొత్తాన్ని రూ.10 వేలకు పెంచి దాదాపు 5600 దేవాలయాలకు అందిస్తున్నామన్నారు. మరో 300 ఆలయాల ప్రతిపాదనలు ఉన్నాయని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీజీఎఫ్ పథకం కింద ఆలయాల పునరుద్ధరణ కోసం నిధులు మంజూరు ప్రక్రియ కూడా కొనసాగుతోందని మంత్రి చెప్పారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వేద పండితుల సంభావన కింద ఒక్కొక్కరికీ రూ. 3 వేలు ఇచ్చే ప్రక్రియ గత నెలలో ప్రారంభించామన్నారు. ఆలయాలలో పనిచేసే అర్చకులకు రూ.15 వేలు, నాయీ బ్రాహ్మణులకు రూ.20 వేలు ఇచ్చేందుకు ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేశామని, రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. ఆలయంలో జరిగే స్వామి ప్రతి కార్యక్రమం ఆగమ పండితుల నిర్ణయం ప్రకారమే జరుగుతుందని, దేవదాయ శాఖ అధికారుల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బి.ఎన్.విజయ్‌కుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత, జేసీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

● మాగుంట ఆఫీసులో మంత్రులు, ప్రజాప్రతినిధుల భేటి

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమీక్షా మండలి సమావేశానికి వచ్చిన రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిదులు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో సోమవారం ఉదయం భేటీ అయ్యారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై ప్రజాప్రతినిధుల మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మరో మంత్రి డాక్టర్ స్వామి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, వైపాలెం ఇన్చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రత్యేక లైన్‌ను ప్రారంభించిన ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, మే 12 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పేర్కొన్నారు. బల్లికురవ సబ్ స్టేషన్ నుంచి వీర్ల గంగమ్మ వైపు ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు కొంతకాలంగాలోవోల్టేజ్ విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. దీంతో పరిశ్రమల యజమానులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకు పోయారు. మంత్రి ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ నుంచి గంగమ్మ దేవాలయం వరకు రూ.30 లక్షల ఖర్చు చేసి ప్రత్యేక విద్యుత్‌లైనును ఏర్పాటు చేశారు. ఈ లైన్‌ను సోమవారం ఈఈ నల్లూరి మస్తాన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భం గా అయన మాట్లాడుతూ, అద్దంకి నియెజక వర్గంలో ఆర్‌టీఎస్ఎస్ ద్వారా నూతన స్తంభాలను లైన్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ప్రజలకు, మరియు పరిశ్రమల వారికి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను అందిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చిన 10 నెలల సమయంలో పెద్ద ఎత్తున విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయా నికి 9 గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా నూతన లైన్ ఏర్పాటు చేసి ప్రారంభించడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టురు ఏడీఈఈ సురేంద్ర బాబు, ఏఈ శ్రీనివాసరావు, లైన్‌మేన్ ప్రతాప్ పాల్గొన్నారు.


విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

మొక్కుబడి మరమ్మతులు

- ఆర్‌అండ్‌బీ రోడ్డు అంచునే తవ్వి బరమ్‌లకు పోయటంతో కుంగే అవకాశం
- మంత్రి రవికుమార్‌కు గోవాడ గ్రామస్థుల ఫిర్యాదు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి రవికుమార్


రోడ్డు అంచునే తవ్వి మార్జిన్‌లో పోసిన మట్టి


బొమ్మనంపాడు సమీపంలో కుంగిన రోడ్డు

అద్దంకి, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగరకొండపాలెం-అంబడిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సుమారు 70 లక్షల రూపాయలతో చేస్తున్న మరమ్మతులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రోడ్డు మార్జిన్ వెడల్పుగా ఉండగా ప్రస్తుతం మరమ్మతుల పేరుతో బరమ్‌లకు మంచి గ్రావెల్ తోలాల్సిన కాంట్రాక్టర్ రోడ్డు అంచునే ఎక్స్‌కవేటర్‌తో తవ్వి పోస్తున్నారు. దీంతో మార్జిన్ పూర్తిగా తగ్గిపోగా ఇప్పటి వరకు పటిష్టంగా ఉన్న బరమ్ కాస్తా తవ్వటంతో పటిష్టత కోల్పోయింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుకు రెండు వైపులా తవ్వి పోసిన గ్రావెల్ మొత్తం జారిపోవటం ఖాయం అని గోవాడ గ్రామస్థులు ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. వెంటనే రవికుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణలో మాత్రమే రోడ్ల మరమ్మతులు చేయాలని, కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యానికి వదిలివేయరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

ఇక శింగరకొండపాలెం నుంచి బొమ్మనంపాడు మీదుగా ముప్పవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు కొన్ని చోట్ల తరచూ కుంగి ఇంకొన్నిచోట్ల ఉబ్బులు వస్తున్నాయి. ఇటీవల మరమ్మతుల సమయంలో కూడా ఆయా ప్రాంతాలలో లూజు మట్టి తొలగించి తారు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉన్నా అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేయటంతో మళ్లీ యథాస్థితికి చేరింది. వేగంగా వచ్చే వాహనాలు అసలే మలుపు కావటం అక్కడే రోడ్డు కుంగి ఉబ్బు రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కాంట్రాక్టర్‌లు ఇష్టానుసారం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా పర్యవేక్షణ లేకుండా చేస్తుండటంతో ఆశించిన ప్రయోజనం రాకపోగా ప్రమాదాలకు నిలయంగా మారాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు జరిగే సమయంలో ఖచ్చితంగా పర్యవేక్షణ చేయాలని పలువురు కోరుతున్నారు.

కమనీయంగా తిరునాళ్ల


తిరునాళ్ల సందర్భంగా తెలుగు యువత ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

- ప్రధాన ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు
- అలరించిన మహిళల కోలాట ప్రదర్శన,
- తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు

పంగులూరు, మే 12(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి వారి 21వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయంలో శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం (అద్దంకి) చెందిన మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. స్వామివారి తిరునాళ్ల సందర్భంగా ఉత్సవ కమిటీ, గ్రామ టీడీపీ, తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్షవర్ధన్‌కు ఈవో శ్రీనివాసరావు, పార్టీ నేతలు, తెలుగు యువత ఘనస్వాగతం పలికింది. ఆలయ ప్రాంగణం, పరిసరాలు విద్యుత్ దీపకాంతులతో శోభను సంతరించుకోగా, తిరునాళ్ల మహోత్సవం తిలకించేందుకు పంగులూరు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకుంది. పూజా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు త్రివేణిబాబు, పార్టీ నాయకులు చౌదరి బాబు, శ్రీకాంత్, జగన్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మంత్రి తనయుడు హర్షవర్ధన్

అవీఇవీ

ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో
కడవకుదురు డ్రైవర్ల సత్తా


కడవకుదురులో నిర్వహిస్తున్న ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే.12(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కడవకుదురు గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు సోమవారం ఉత్సహంగా జరిగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీలలో పాల్గొనేందుకు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన కొత్తపట్నం, ఒంగోలు, పర్చూరు, ఇంకొల్లు, చింతగుంపల్లె, పెదగంజాం తదితర ప్రాంతాలకు చెందిన 24 మంది డ్రైవర్లు వచ్చినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలలో కడవకుదురు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి(షేక్.షరీఫ్‌డ్రైవర్) నిర్ణీత ఒక నిమిషం వ్యవధిలో 252 అడుగుల దూరం నడిపి మొదటి బహుమతి రూ.5,116లను కైవసం చేసుకున్నాడు. కడవకుదురుకు చెందిన గాజుల జగదీష్ 178 అడుగుల దూరం నడిపి రెండ బహుమతి రూ.3,116లను, కడవకుదురుకు చెందిన కేశన బాజీ 152 అడుగుల దూరం నడిపి మూడవ బహుమతి రూ.2,116లు అందుకు న్నారు. న్యాయ నిర్ణీత, యాంకర్‌గా తంగెడ హసాన్ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వ హణ కమిటీ సభ్యులు పేరాబత్తుల రామకృష్ణ, తోటకూర సుబ్బారావు, బత్తిన శ్రీనివాసరావు, గుద్దేటి వెంకటేశ్వర్లు, తోటకూర వీరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను పూర్తిచేయండి


అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ ఖాదర్ వలి, ఏఈ రాహుల్

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై డబ్బులు చాలక ఇళ్లనిర్మాణాలను పూర్తిచేసుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి చెప్పారు. ఆయన సోమవారం మార్టూరులో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోలేని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 50 వేల రూపాయలను మంజూరు చేసిందన్నారు. దాంతో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను పూర్తిచేసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన మార్టూరు హౌసింగ్ కార్యాలయంలో మండలంలో వివిధ స్టేజీలలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వాటి నిర్మాణాలను పూర్తిచేసేవిధంగా లబ్ధిదారులకు అవగాహన కలిగించాలన్నారు.అనంతరం మార్టూరు హౌసింగ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ ను అభినందించారు. పక్కా ఇళ్లు మంజూరయిన లబ్దిదారులకు సక్రమంగా సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్ స్పెక్టర్ అప్పారు హరిప్రసాద్ పాల్గొన్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, మే 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా సోమవారం లక్ష తమలపాకుల పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకము, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి 11 ఆవృత్తములుగా వేద పండితులు, పూజారులు లక్ష తమలపాకుల పూజ చేశారు. ఉభయదాతలుగా గుంటూరు న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

కనులపండువగా ఆంజనేయస్వామి కల్యాణం

పావులూరు తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు


అలంకరణలో ఆంజనేయస్వామి

పావులూరు(ఇంకొల్లు),మే 12, (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న పొలిమేర వీరాంజనేయస్వామి 71వ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం ఎండతీవ్రతను సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం సువర్చల సమేత వీరాంజనేయస్వామి వారి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కనుల విందుగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చొని స్వామి కల్యాణం జరిపించారు. ఈ 71వ కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరునాళ్లను ఏర్పాటు చేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారి వద్దకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అన్నదాన సత్రాలలో అన్నదానం నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి వరకు భక్తుల రద్దీ తగ్గలేదు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకున్నారు.


పోటీలలో పాల్గొన్న గుంటూరు జిల్లా ఎడ్ల జత

పోల్‌రాదా పోటీలలో పెదపూడి ఎడ్ల సత్తా

అలరించిన పోటీలు

చినగంజాం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పోలేరమ్మ వారి తిరునాళ్లను పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి న్యూ జూనియర్ విభాగం నాటుబండి పోలురాదా ఎడ్ల పందేలు ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా, అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన ఎడ్లజత ప్రథమ బహుమతిని కైవసం చేసుకొంది. గ్రామస్థుల సహకారంతో, నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలైన ఎడ్ల యజమానులకు దాతలు సోమవారం నగదు బహుమతులను అందజేశారు.

బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, పెదపూడి గ్రామానికి చెందిన ఆలా హరికృష్ణయాదవ్ ఎడ్ల జత నిర్ణీత పదినిమిషాల వ్యవధిలో 5605.2 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.30వేలను కైవసం చేసుకొంది. కడవకుదురు గ్రామానికి చెందిన కె.కె.కన్‌స్ట్రక్షన్స్ అధినేత బత్తిన కోటేశ్వరరావు విజేతలైన ఎడ్ల యజమానికి ప్రథమ బహుమతిని అందజేశారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం, గార్లపాడు గ్రామానికి చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 5100 అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.25 వేలు, చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన చెరుకూరి ఉషారాణి ఎడ్లజత 5060.7 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ.20వేలు, నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలేనికి చెందిన బొడ్డు బాలకృష్ణ ఎడ్ల జత 4868.5 అడుగుల దూరం లాగి నాల్గో బహుమతి రూ.15వేలు, బాపట్ల మండలం కొత్తమద్దిబోయినవారిపాలేనికి చెందిన పిన్నబోయిన మణీంద్ర ఎడ్లజత 4825.8అడుగుల దూరం లాగి ఐదో బహుమతి రూ.10వేలు, చినగంజాం మండలం మున్నంవారిపాలేనికి చెందిన కుమ్మరి నాగశ్రావణి, బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన జజ్జర యలమంద, వెంకటగోపాలకృష్ణల సంయుక్త ఎడ్లజత 4792.5 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి రూ.7.500వేలను కైవసం చేసుకున్నాయి. న్యాయనిర్ణేతగా తంగెడ హుస్సేన్ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు బత్తిన శ్రీనివాసరావు, గద్దేటి వెంకటేశ్వర్లు, తోటకూర సుబ్బారావు, పేరాబత్తుల రామకృష్ణ, తోటకూర వీరయ్య గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఎడ్ల యజమానులకు బహుమతి అందజేస్తున్న కె.కె.కన్‌స్ట్రక్షన్స్ అధినేత కోటేశ్వరరావు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం సేవించి ఎండలో తిరగడంతో వడదెబ్బకు గురై 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం స్థానిక ఓఎంఎల్ మిల్క్‌లైన్ పక్కన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి ప్రధాన రహదారి నుంచి కలికివాయికి వెళ్లే పాతరోడ్డు పక్కన ఉదయం నుంచి మద్యం సేవిస్తూ సంచరిస్తున్నాడు. తీవ్రమైన ఎండకు వడదెబ్బ తగలడంతో సాయంత్రానికి మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై మహేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.శవపరీక్ష నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

పొగాకు రైతుకు భరోసా ఇవ్వాలి


మాట్లాడుతున్న మంత్రులు స్వామి, రవి, పక్కన ఎంపీ మాగుంట, కలెక్టర్ అన్సారియా, బోర్డు ఈడీ విశ్వశ్రీ, ఎమ్మెల్యేలు

బోర్డు అధికారులు, వ్యాపారులను కోరిన మంత్రులు గొట్టిపాటి, డాక్టర్ డోలా

పొగాకు మార్కెట్‌పై బోర్డుఅధికారులు, వ్యాపార, రైతు ప్రతినిధులతో సమీక్ష

పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు, రైతుల ఆవేదన ఏకరువు

ఒంగోలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతుల్లో ప్రస్తుతం పంట కొనుగోలు, ధరలపై ఆందోళన ఉందని, వారికి భరోసా ఇవ్వాలని పొగాకు బోర్డుఅధికారులు, కంపెనీల ప్రతినిధులను రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామిలు కోరారు. దక్షిణాది పొగాకు మార్కెట్ సంక్షోభంలోకి వెళ్తున్న నేపథ్యాన్ని గుర్తించి రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు టీడీపీ ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. వేలం కేంద్రాలకు నేరుగా వెళ్లి కొనుగోళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించి రైతులు, బయ్యర్లతో మాట్లాడారు. ధరలు దిగజారడం, కొనుగోళ్లు సరిలేకపోవడాన్ని గమనించారు. ఈ నేపథ్యంలో మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటిలు చొరవచూపి సోమవారం ఒంగోలులో కీలక సమావేశం నిర్వహించారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ అన్సారియాతో పాటు పొగాకు కొనుగోలు చేసే ప్రధాన కంపెనీల ప్రతినిధులు, వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు హాజరయ్యారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. రైతులు, వారి తరఫున పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు ప్రస్తుత మార్కెట్ తీరు, రైతులకు జరుగుతున్న నష్టం, వారిలో ఉన్న ఆందోళనను సమావేశంలో ఏకరువుపెట్టారు. దీనిపై మంత్రులు స్పందిస్తూ తాము కూడా వేలం కేంద్రాలు సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించామన్నారు. వ్యాపారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం గిట్టుబాటు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని, రోజువారీ నోబిడ్‌లు లేకుండా చూడాలని కోరారు. కేవలం మేలు రకం ఒక్కటే కాకుండా అన్నిరకాల గ్రేడ్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులు, అధిక ఉత్పత్తి వంటి కారణాలను బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకురాగా.. విదేశీ ఆర్డర్లు ఖరారు అయితే మరింత వేగంగా తాము కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని వ్యాపార ప్రతినిధులు వివరించారు. విదేశీ ఆర్డర్లు వచ్చేంత వరకు జాప్యం చేయకుండా రైతుల ఆందోళనను అర్థం చేసుకొని పంట కొనుగోలు చేయాలని వ్యాపారులను బోర్డు ఈడీ విశ్వశ్రీ కోరారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు రైతులు ఇబ్బందులు, ఆందోళనను సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం

అవసరమైతే పంచాయతీ నిధులు వినియోగం

అన్నివర్గాలకూ సంక్షేమ ఫలాలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. డీఆర్సీ సమావేశం అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరం ఉంటే పంచాయతీల్లో నిధులను ఖర్చు చేయాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వం నుంచి కూడా నిధులు రాబడతామన్నారు. జలజీవన్ మిషన్‌లో గత ప్రభుత్వం రాష్ట్రం వాటా చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానమంత్రిని కలిసి పథకం అమలు గడువును మరో రెండేళ్లు పొడిగించారన్నారు. తద్వారా ఇంటింటికీ కొళాయి నీరు ఇచ్చి సమస్యను తీరుస్తామని మంత్రి తెలిపారు. జిల్లాలో కరువు నివారణ దిశగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేయాలని ఆదేశించామన్నారు. నగరాలు, పట్టణాల్లో నిరుపయోగంగా ఉన్న ఖాళీస్థలాల్లో ఎన్‌బీసీసీతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అందుకు ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. అంతకు ముందు డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యేలు పలు ప్రధాన సమస్యలను ప్రస్తావించారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

తూమాటి మాధవరావు, ఎమ్మెల్సీ



ఈ ఏడాది అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి.

అమృత్ పనులను త్వరగా పూర్తిచేయాలి

దామచర్ల జనార్దన్, ఒంగోలు ఎమ్మెల్యే



ఒంగోలు ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాతో పాటు అమృత్ పథకం కింద చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో 23,636 మందికి నివేశన స్థల పట్టాలు ఇచ్చారు. అందులో 13వేల మంది అనర్హులుగా అధికారులు గుర్తించారు. వారిని తొలగించి అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ముత్తుముల అశోక్‌రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే



గిద్దలూరు నియోజకవర్గంలో అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలి. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆర్ఎస్ఆర్ కంటే వెబ్‌ల్యాండ్‌లో తక్కువ భూమి నమోదైంది. దీనిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలి. కొమరోలు మండలంలో ఆర్ఆర్ ప్యాకేజీ కింద అర్హత లేకుండానే కొంతమంది అక్రమంగా రూ.7 కోట్లు లబ్ధిపొందారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలి.

తాగునీటికి ఇబ్బందులు

నారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే



పశ్చిమ ప్రకాశంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల బోర్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. పైపులైన్లు దెబ్బతిన్నాయి. గతంలో తాగునీటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తర్లుపాడు మండలంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

మంచినీటి పథకం పనిచేయడంలేదు

బీఎన్.విజయకుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే



నాగులుప్పలపాడు రక్షిత మంచినీటి పథకం పది రోజుల నుంచి పనిచేయడం లేదు. సత్వరమే ఆ పథకం పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటేప్రజలకు ఇబ్బంది తప్పదు.

సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండానే...

తాటిపర్తి చంద్రశేఖర్, వైపాలెం ఎమ్మెల్యే



సర్పంచ్‌ల తీర్మానం లేకుండానే ఉపాధి పనులు చేస్తున్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వెంటనే పరిష్కరించాలి.

ప్రజలకు తాగునీటిని అందించాలి

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే



దర్శి నియోజకవర్గ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. పలు గ్రామాల్లో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయాలి.

ఉపాధి పనులను అమలు చేయాలి

డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే



కనిగిరి మునిసిపాలిటీలో మూడు గ్రామాలు విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేయాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గంలో రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించిన మోటార్లు తరచూ పాడవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే వాటి స్థానంలో కొత్త మోటార్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలి

దామచర్ల సత్యనారాయణ, మారిటైం బోర్డు చైర్మన్



జిల్లాలో నీటి వనరులు లేని నియోజకవర్గం కొండపి. ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించి రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పాకల బీచ్‌ను అభివృద్ధి చేయాలి. సింగరాయకొండ, టంగుటూరు, సూరారెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబీలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

మంచినీటి వనరులు ఉప్పుగా మారుతున్నాయి

నూకసాని బాలాజీ, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్



సింగరాయకొండ మండలం బింగినపల్లి చెరువు పరిధిలో ఆక్వా సాగు ఎక్కువగా ఉంది. ఆ చెరువుల నుంచి విడుదలయ్యే కలుషిత జలాల వల్ల స్థానిక మంచినీటి వనరులన్నీ ఉప్పులుగా మారుతున్నాయి. దానిపై అవసరమైన చర్యలు తీసుకోవాలి.

మోదకొండమ్మను దర్శించుకున్న ఒంగోలు ఎస్పీ

పాడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఒంగోలు ఎస్పీ ఏఆర్ దామోదర్ కుటుంబంతో సహా మోదకొండమ్మను సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్పీ దామోదర్ దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆయన 2011, 12లో స్థానిక ఏఎస్పీగా, ఆ తరువాత నర్సీపట్నంలోని నక్సల్స్ ఆపరేషన్ ఓఎస్డీగా పని చేశారు. దీంతో ఈ ప్రాంతంతో ఆయనకు అనుబంధం ఉంది. అలాగే మోదకొండమ్మ అంటే ఆయనకు ఎంతో భక్తి, దీంతో తన కుమార్తెకి అమ్మవారి పేరునే పెట్టుకున్నారు. ఆయన ఎక్కడ పని చేసినా ప్రతి ఏడాది పాడేరు వచ్చి మోదకొండమ్మను దర్శించుకుంటారు.


అమ్మవారి సన్నిధిలో ఎస్పీ ఏఆర్ దామోదర్ దంపతులు

సర్పంచ్ చెక్‌పవర్ పిటిషన్ కొట్టివేత

సీఎస్‌పురం(పామూరు), మే 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం కొవిలంపాడు గ్రామ సర్పంచ్ ఖాదర్‌బీబీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి అధికారులు చెక్ పవర్ రద్దు చేశారు. చెక్ పవర్ రద్దుపై స్టే ఇవ్వాలని కోరుతో సర్పంచ్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. వాయిదా అనంతరం పిటిషన్‌ను కోర్టు వారు డిస్మిస్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఘటన

బోరున విలపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మృతుల్లో ఒకరిది చీరాల, మరోకరిది గుంటూరు

చినగంజాం(చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన చిన్నగంజాం సమీపంలో చీరాల - ఒంగోలు 216 జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. అందిన వివరాల ప్రకారం పేరాల గాంధీనగర్‌కు చెందిన కొండ్రుపాటి ప్రభుదాసు(25), వేటపాలెం చేనేతపురి కాలనీకు చెందిన కారంపూడి పద్మ(45) వివిధ కార్యక్రమాలకు వంటపని చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే సోమవారం తెల్లవారుఝామున ఇంటి నుంచి ఒకే ద్విచక్ర వాహనంపై చినగంజాంలో వంటపని చేసేందుకు వెళ్లారు. పని ముగిశాక మధ్యాహ్న సమయంలో తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. చినగంజాం పరిధిలోని ఓ రెస్టారెంట్ సమీపంలో ఒంగోలు వైపు నుంచి చీరాలకు వస్తున్న లారీ వెనుక నుంచి వేగంగా వీరిని ఢీకొంది. ప్రమాదంలో పద్మ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రభుదాసు కొనఊపిరితో కొట్టిమిట్టాడుతుండగా స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం చీరాల ఏరియా వైద్యశాలలో పద్మ మృతదేహం, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుదాసు మృతదేహం ఉన్నాయి. చినగంజాం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురు మృతికి కారకులైన డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మృతులు ఇద్దరు వారి కుటుంబాల్లో కీలకం కావడం విశేషం. ప్రభుదాసుకు భార్య సంధ్యారాణి, రెండేళ్ల పాప, ఆరు నెలల రెండో పాప సంతానం. ఇద్దరిది ప్రేమ వివాహం. ఉన్న దానిలోనే ఎంతో ఆనందంగా సాగుతున్న వీరి కుటుంబంలో ప్రస్తుతం విషాదం అలుముకుంది. చీరాల ఏరియా వైద్యశాల నుంచి గుంటూరుకు తరలించే సమయంలోనే వైద్యశాల వద్దకు చేరుకుని భార్య సంధ్యారాణి చంటి బిడ్డను చంకలో ఉంచుకుని బోరున విలపించడం పలువురిని కలచివేసింది. అలాగే పద్మ అనివార్య కారణాలతో భర్తకు దూరంగా ఉంటోంది. ఒక్కగానొక్క కుమార్తె (వివాహమైంది)కు తోడుగా ఉంటుంది. ఉన్న ఒక్క తల్లి కూడా మృత్యువాత పడటంతో కుమార్తె విషణ్ణ వదనంలో ఉండిపోయింది.


కారంపూడి పద్మ(ఫైల్)


కొండ్రుపాటి ప్రభుదాసు(ఫైల్)

దోర్నాలలో నీటి కష్టాలు

అరకొర ట్యాంకర్లతో సరఫరా

సిగపట్లు పడుతున్న మహిళలు

వనరులున్నా వినియోగంలోకి తేని అధికారులు

పెద్ద దోర్నాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండు వేసవిలో మండుటెండలతో మనుషులు, పశువుల దాహం తీర్చుకునేందుకు నానాకష్టాలు పడుతున్నారు. అధికారులు మాత్రం అరకొర ట్యాంకర్ల సరఫరా చేస్తుండడంతో బిందె నీటి కోసం గ్రామాలు, పల్లెలు అన్న తేడా లేకుండా మహిళలు సిగపట్లు పడుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులకు అన్నీ తెలిసినా చూడనట్టు నటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. దోర్నాలలో నీటి కష్టాలు వర్ణణాతీతం. ఐనముక్కల, తిమ్మాపురం గ్రామాల్లో నీటి వనరులున్నా సంబంధిత అధికారులు వాటిని వినియోగించడంలో వైఫల్యం చెందుతున్నారు.మోటార్లు కాలిపోతే పది రోజులకు కూడా పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లు నీటిని కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉన్నా మోటార్లు మరమ్మతులకు గురైతే వారం పది రోజులు వరకు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లు నీటిని ప్రజలకు సరఫరా చేయకుండా ప్రైవేటు వ్యక్తులు, హోటళ్లకు విక్రయిస్తూ, ట్యాంకర్లతో ఒకటి అరా సరఫరా చేస్తే ఆ నీరు పట్టుకోవడంలో మహిళలు తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో గొడవలకు దారితీస్తున్నాయి. మోటార్లు బాగు చేయరు, సరపడా నీటిని సరఫరా ఎందుకు చేయరని అధికారులను అడిగితే కలెక్టర్ అంత వరకే పర్మిషన్ ఇచ్చారని బదులిస్తున్నారు. 50 కుటుంబాలున్న వీధికి రెండు రోజులకోసారి ఒక ట్యాంకరుతో నీటిని సరఫరా చేస్తే ఏ విధంగా సరిపోతాయని ప్రజలు వాపోతున్నారు. కొందరు అధికారులు అసలు సమాధానం చెప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


నీళ్ల ట్యాంకరు వద్ద అవస్థలు పడుతున్న ప్రజలు

అవీ..ఇవీ



పూజలో పాల్గొన్న భక్తులు, కళాకారులు

ఘనంగా అన్నమాచార్య జయంతి

ఒంగోలు(కల్చరల్), మే 12(ఆంధ్రజ్యోతి):పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమం సమితి అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అన్నమాచార్యుల విగ్రహానికి పూలమాలాంకృతుని చేసి షోడసోపచార పూజ నిర్వహించారు. అనంతరం మురళీకృష్ణతో పాటు పలువురు గాయకులు అన్నమాచార్య సంకీర్తనలు గానం చేశారు. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జున రావు, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ఆకుల శ్రీను, ఓవిఎస్ ప్రసాద్, డి.ప్రసన్న కుమారి, పి.జానకిరాం, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అటు స్థానిక రంగారాయుడు చెరువు గాంధీపార్కు దగ్గర ఉన్న అన్నమయ్య విగ్రహానికి లలిత కళా అకాడమీ ఆధ్వర్యంలో పలువురు పూలమాల వేసి పూజ నిర్వహించారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వర రావు, పలువురు సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

శిక్షణకు 75 శాతం హాజరు ఉంటేనే కుట్టుమిషన్

సంతనూతలపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి 75 శాతం హాజరు ఉంటేనే కుట్టుమిషన్ పంపిణీ చేస్తామని ఎంపీడీవో డి.సురేష్‌కుమార్ తెలిపారు. సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లకు కలిపి 72 మంది మహిళలు టైలరింగ్ శిక్షణకు ఎన్‌రోల్ చేసుకోగా 60 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. అయితే టైలరింగ్ శిక్షణలో 75 శాతం హాజరు ఉంటేనే కుట్టుమిషన్ పంపిణీ అని లేకుంటే పంపిణీ చేయడం కుదరదని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కే.లత, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖరరావు

చిన్నారులకు ఆధార్ వచ్చే విధంగా చూడాలి

ఒంగోలు(రూరల్)మే12(ఆంధ్రజ్యోతి):సున్నా నుంచి 6 సంవత్సరాల లోపు చి న్నారులకు ఆధార్ కార్డు వచ్చేవిధంగా అంగన్‌వాడీ టీచర్‌లు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు అన్నారు. ఒంగోలు మండలం కరవది గ్రామపంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఆధార్‌కార్డు ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. ఆధార్ కార్డు లేనివారికి సంక్షేమ పథకాలువచ్చేపరిస్థితి ఉండదన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ టీచర్‌లు బాలింతలకు ఆధార్ కార్డు ప్రాధాన్యతను గురించి తెలపాలని, ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు వచ్చేవిధంగా చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, టీచర్‌లు పాల్గొన్నారు.



డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న కమ్మవారి సేవా సంఘం సభ్యులు

డాక్టర్ సీతారామయ్యకు సన్మానం

ఒంగోలు(కల్చరల్), మే 12(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సోమవారం జిల్లా కమ్మవారి సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక నిర్మల్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ సీతారామయ్య హయాంలో రైతులకు విస్తృతంగా సేవలు అందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపి రాష్ట్రంలోనే ఉత్తమ బ్యాంకుగా నిలపటానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలా హనుమంత రావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘుపతి రావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాసరావు, గోగినేని శ్రీనివాస రావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు చౌదరి, మన్నం సుబ్బారావు, గోగినేని కిషోర్, నంబూరి శ్రీరాములుపాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

● పాఠకులకు ఇబ్బందులు



శిథిల స్థితిలో ఉన్న గ్రంథాలయం

సంతనూతలపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు, చిన్నారులకు చందమామ, ఆటవిడుపుకథలు చదివేందుకు వేదికైన సంతనూతలపాడులోని గ్రంథాలయం ఏళ్ల తరబడి నిర్వహణలేక పాడైంది. చదువుకోవడానికి గ్రంథాలయానికి వచ్చే వారి భద్రత గాల్లో దీపంలా మారింది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో విద్యార్థులకు ఈ శిథిలావస్థ భవనంలోనే వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి. దీంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. 1986వ సంవత్సరంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందుల్లో రెండు గదులు, ఒక హాలుమాత్రమే ఉంది. ఈహాల్‌లో పాఠకులు, విద్యార్థులు చదువుకుంటున్నారు. గదులతో పాటు హాల్, స్లాబు పూర్తిగా దెబ్బతిని ఇనుపచువ్వలు బయటపడి పెచ్చులూడిపడుతున్నాయి. ఇక వర్షం వస్తే చాలు భవనం గోడలు నానిపోయి, ఉరవడంతో పుస్తకాలు తడిసిపోతున్నాయి. కాగా పంచాయతీలనుంచి గ్రంథాలయానికి ఒక్క రూపాయికూడా జమ కావడం లేదని, ఇటీవల తనిఖీలకు వచ్చిన జిల్లా అధికాధికారికి కూడా తెలిపినట్లు సంతనూతలపాడు గ్రంథాలయాధికారి తెలిపారు. అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టడమా లేదా నూతన భవనం ఏర్పాటు చేయడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

సంతనూతలపాడు గ్రంథాలయం శిథిలావస్థలో ఉంది. వర్షం వస్తే మరింత ఇబ్బందిగా ఉంటుంది. పాఠకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-గ్రంథాలయాధికారి సత్యనారాయణ

మలేషియా యూనివర్సిటీతో పేస్ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను చూపుతున్న పేస్ కళాశాల యాజమాన్యం

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మలేషియాలోని ప్రభుత్వ యూనివర్శిటీతో పేస్ ఇంజనీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం(ఎంవోయూ)కుదుర్చుకున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈవిషయాన్ని వెల్లడించారు. తమ కళాశాల ఆవిర్భవించి 18వ వసంతంలోకి అడుగుపెడుతుందన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న శ్రీధర్ తెలిపారు. విద్యార్థులకు విదేశీ సాంకేతికతను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు మలేషియా ప్రభుత్వ యూనివర్శిటీతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ ఒప్పందం ద్వారా టెక్నాలజీని పంచుకోవడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. జూలైలో తమ కళాశాల విద్యార్థులు మలేషియా యూనివర్శిటీకి వెళ్తారన్నారు. అక్కడ వారికి ఉచితభోజన వసతితో పాటు విద్య కూడా ఉచితంగా లభిస్తుందన్నారు. అదే విధంగా ఫ్యాకల్టీ టీచింగ్, లెర్నింగ్‌కు పరస్పర మార్పిడి జరుగుతుందన్నారు. విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని శ్రీధర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు ఆర్. వీరాంజనేయులు, కే రూప అక్కేష్, సీవీ సుబ్బారావు ఉన్నారు.

పుస్తక సంపుటి ఆవిష్కరణ



పుస్తక సంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆనం,స్వామి

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : 'నా జీవన ప్రస్థానం' పుస్తక సంపుటికను సోమవారం స్థానిక స్పందన హాలులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామిలు ఆవిష్కరించారు. బీవీ సాగర్ 25 ఏళ్లలో జిల్లాలో, రాష్ట్రంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాల్య వివాహాలు, బాలలు, మహిళలు అక్రమ రవాణా, బాలికలు, మహిళలపై లైంగికవేధింపుల నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, నిరాశ్రయులైన వృద్ధులు, వితంతువుల శ్రేయస్సు, హెచ్ఐవీబాధితుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ప్రచురించిన పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు.

ఉపకరణాల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సహిత విద్య ఆధ్వర్యంలో దివ్యాంగులకు సోమవారం స్థానిక స్పందన హాలు వద్ద రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, డీఈవో కిరణ్‌కుమార్, సహిత విద్యసమన్వయకర్త పి. నాగేంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌గా మధుసూదనరావు



తహసీల్దార్ మధుసూదనరావును అభినందిస్తున్న మండల కార్యాలయ ఉద్యోగులు

ఒంగోలు(రూరల్),మే12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ తహసీల్దార్‌గా పిన్నక మధుసూదనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపట్నం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న మధుసూదనరావు ఒంగోలుకఅర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వాసు వెలిగండ్ల మండల తహసీల్దార్‌గా బదిలీఅయ్యారు. బాధ్యతలు స్వీకరించిన మధుసూదనరావుని మండల తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు అశోక్, శీలం శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

అబ్బురపరచిన అబ్దుల్ మ్యాజిక్



మ్యాజిక్ చేసి చూపుతున్న అబ్దుల్ మాలిక్

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాయలు మంత్రాల పేరుతో కొంత మంది అమాయకులను ఏలా మోసం చేస్తున్నారో విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు ప్రముఖ మెజీషియన్ రామన్ చూపించారు. ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విద్యార్థులకు మ్యాజిక్ ఏలా చేయాలో చూపించారు. అబ్బురపరిచే మ్యాజిక్‌లను విద్యార్థులకు నేర్పించారు. దీంతో విద్యార్థులు మ్యాజిక్ నేర్చుకొనేందుకు ఆసక్తిని ప్రదర్శించారు. అనంతరం అబ్దుల్ మాలిక్ విద్యార్థులకు ఆటలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో వీర స్వామి, వినోద్ ఉన్నారు.

స్టార్టప్‌లపై క్విస్‌లో వర్క్‌షాపు

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం స్టార్టప్‌లు, ఐసీలపై విద్యార్థులకు వర్క్‌షాపును నిర్వహించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. ఎన్ఐటీ ఏపీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. సందీప్ ఈ వర్క్‌షాపులో వివిధ అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీ గాయత్రిలు మాట్లాడుతూ ఈ వర్క్‌షాపులు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ట్రిబుల్‌ఈ విభాగాధిపతి మౌళిచంద్రన్, కో ఆర్డినేటర్ ధరణి తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి రోజు సోమవారం కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డీబార్ చేశారు. విజ్ఞాన జూనియర్ కళాశాల విద్యార్థి యర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తూ కాపీయింగ్‌కు పాల్పడ్డారు. పరీక్షా కేంద్రాలకు అమర్చిన సీసీ కెమెరాలను ఒంగోలులోని ఆర్ఐవో కార్యాలయానికి అనుసంధానం చేశారు. జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును మానిటర్ తెరపై వీక్షిస్తున్న జిల్లా పరీక్షల కమిటీ సభ్యులకు కాపీయింగ్ కనిపించింది. వెంటనే వైపాలెం పరీక్షా కేంద్రం చీఫ్‌ను అలర్ట్ చేసి ఆ విద్యార్థిని డీబార్ చేయించినట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 19నుంచి జరగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూఅధికారి చిన ఓబులేషు ఆదేశించారు. స్థానిక డీఆర్వో చాంబర్‌లో సోమవారం పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకోసం 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

తాలూకా సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయకృష్ణ

ఒంగోలు క్రైం, మే12(ఆంధ్రజ్యోతి): తాలూకా సీఐగా విజయకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరయ్య చౌదరి హత్య కేసు అనంతరం ఒంగోలు తాలూకా సీఐగా పనిచేస్తున్న అజయ్ కుమార్‌పై వేటు వేశారు. ఆయనను వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న విజయకృష్ణను సీఐగా నియమిస్తూ ఈనెల 7న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం అక్కడ సిబ్బందితో సమావేశం అయి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. తరువాత ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

అతిథి అధ్యాపకులకు శుభవార్త

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులు(గెస్ట్ టీచర్లు)గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారికి ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాన్ని రెండు రెట్లు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అతిథి అధ్యాపకులకు ప్రస్తుతం గంటకు రూ. 150 చెల్లిస్తుండగా దానిని రూ. 375కు పెంచారు. అయితే ఈ పెంపుదల గరిష్ఠంగా రూ. 27వేలకు మించరాదు. ఈ ఉత్తర్వులపై తగు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్యా డైరెక్టర్‌ను పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఆదేశించారు. గౌరవ వేతనం పెంపు పట్ల అతిథి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు మే నెల జీతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు 2024 మే నెల జీతం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు ఫైల్‌ఆర్థిక శాఖకు చేరింది. ఈ జీతం చెల్లింపునకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన హకరించిన ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతి శుక్లాను జేఏసీ నాయకులు సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కార్యదర్శి చక్రమల్లి నాయక్, మహిళా ప్రతినిధులు రాజ్యలక్ష్మి, విజయకుమారి, సింధు తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు సోమవారానికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ఆరు నెలల బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు.



శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

మద్దిపాడు మే12(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం ఏడుగుండ్లపాడు శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని రూపుదిద్దటంలో విద్యాసంస్థల బాధ్యత ఎంతో ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక శాస్త్రాలు, భాషలు, సృజనాత్మకత పెంపొందేలా రూపొందించాలని అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతలకు అనుగుణంగా నైపుణ్యాలను మహిళలు పెంపొందించుకోవాలని అన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో అందించే జ్ఞానం విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు, ఎస్ఎన్ పాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్, మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి, డాక్టర్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత తదితరులు పాల్గొన్నారు.



తొట్లలో నీరు నింపుతున్న నిర్వాహకులు

మూగజీవాల కోసం నీటి తొట్టెలు

ఒంగోలు(కల్చరల్), మే 12(ఆంధ్రజ్యోతి):వేసవిని దృష్టిలో పెట్టుకుని మూగజీవాలకు నీటితొట్టెలు ఏర్పాటుచేసినట్లు ప్రముఖ జంతు ప్రేమికుడు జగన్నాధం విష్ణువర్దన్ తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ శక్తిసదన్ ముందు సీజర్ రెస్క్యూ అండ్ కేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ భవాని నమకాల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను సోమవారం జనసేన నాయకులు కంది రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులు నోరు తెరిచి తమ దాహార్తిని తెలుపుకోలేవని అటువంటి వాటికోసం నీటి తొట్లు ఏర్పాటుచేయటం అభినందనీయమని అన్నారు. నీటి తొట్లు ఏర్పాటుకు ముందుకు వచ్చి సహకారం అందించిన మహిళాభ్యుదయ సమితి నాయకురాలు తేళ్ల అరుణ, ఇతరులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫర్ ఆనిమల్స్ సొసైటీ అధ్యక్షుడు అరుణ సికిందర్, జంతు ప్రేమికురాలు బిందు, మహిళాభ్యుదయ సమితి కోశాధికారి బీరం అరుణ, హరిశంకర్, ప్రభుకుమారి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

● రెండు కేసుల నమోదు

ఒంగోలు క్రైం, మే12(ఆంధ్రజ్యోతి): స్థల వివాదంలో జరిగిన ఘర్షణకు సంబంధించి పోలీసులు ఆలస్యంగా రెండు కేసులు నమోదు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైలుపేటలో ఈ వివాదం జరిగింది. పాలేటి మదన్ మోహన్ అనే వ్యక్తి తన ఇంటి వద్ద నుంచి ఫోన్ మాట్లాడుకుంటూ వెళుతుండగా వరదా వెంకటకృష్ణారావు ఆయన కుటుంబ సభ్యులు మరి కొంతమంది కలిసి కళ్లలో కారం కొట్టి కత్తులతో దాడి చేశారని, ఆపై కులంపేరుతో దూషించారని మదన్‌మోహన్ ఫిర్యాదు చేశారు. అదేసమయంలో మదన్‌మోహన్ అతని బాబాయి సువర్ణరాజు మరికొంతమంది కలిసి కత్తులతో దాడిచేసి గాయపరిచినట్లు వెంకటకృషారావు కుమారుడు సుబ్బారావు అతని స్నేహితుడు సునీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రెండు కేసులు నమోదు చేసినట్లు ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

స్టేట్‌మెంట్ రికార్డులో జాప్యం

శనివారం రాత్రి 7.30కి ఘర్షణ జరిగింది. అక్కడకు పోలీసులు వెళ్లారు. గాయపడిన వారిని ఆసుపత్రికి పంపించమని ఉచిత సలహా ఇచ్చి వెళ్లారు. అయితే అక్కడ ఔట్‌పోస్టు పోలీసులు వరద సుబ్బారావు, సునీల్ ఇచ్చిన స్టేట్‌మెంట్ రికార్డు చేసి వెంటనే ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు పంపించారు. మదన్‌మోహన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ 11 తేదీ సాయంత్రం పోలీసు స్టేషన్‌కు పంపించారు. ఏదైనా ఘర్షణ జరిగితే ఇరువర్గాల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసి వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు పంపించాలి. కానీ పోలీసులు రెండురోజుల తరువాత కేసులు నమోదు చేయడం గమనార్హం.

గ్రానైట్ యజమానుల ఖాతాలో నగదు జమ

మద్దిపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): కరోనాలో లాక్‌డౌన్ సందర్భంగా కరెంట్ చార్జీలు చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు తమ ఖాతాలలో నగదు జమ అయినట్లు గుండ్లాపల్లి పారిశ్రామికవాడ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ రత్నాకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం కృషివల్లనే ఇది సాధ్యమయిందని అన్నారు. ఖాతాలకు నగదు జమ కావటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

రుణాల రికవరీకి కృషి చేయాలి

సంతనూతలపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలు వందశాతం రికవరీకి వీవోఏలు కృషిచేయాలని మండల వెలుగు కార్యాలయ ఏపీఎం టి.బాబూరావు తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మైక్రో క్రెడిట్ సంస్థల బారిన పడకుండా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలను సకాలంలో ఇప్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సీసీలు, వీవోఏలు. వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావు జీవితం ఆదర్శనీయం

మద్దిపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): సుబ్బారావు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని అఖిల భారత రైతు సమాఖ్య ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య అన్నారు. పెద్దకొత్తపల్లి పంచాయతీ అంజయ్య నగర్‌లో సీపీఐ గ్రామ కార్యదర్శి అంగలకుర్తి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఎద్దు సుబ్బారావు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎద్దు సుబ్బారావు, నల్లూరి అంజయ్యలు అనేక పోరాటాలను చేశారని మన జిల్లాలో జరిగిన వ్యవసాయ కార్మిక వర్గ పోరాటాలలో అగ్రభాగాన పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంసీ వెంకటేశ్వర్లు, ఉప్పుటూరు ప్రకాష్ రావు, ఎద్దు అజయ్, అనంతలక్ష్మి, డాక్టర్ రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం, మే12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమంలో 50 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తమ వినతులను అందజేశారు. ఈమేరకు ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు నేరుగా ఆయా పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమణకుమార్, సీఐలు పాండురంగారావు, జగదీష్, దుర్గాప్రసాద్, షమీముల్లాలు పాల్గొన్నారు.


రథోత్సవంలో రమా సహిత సత్యదేవుడు

వైభవంగా సత్యదేవుని రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని 9వ వార్డులో వెలసియున్న శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరిశంకర శర్మ సత్యనారాయణస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం సత్యదేవునికి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రమా సహిత సత్యదేవుని ఉత్సవర్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ వీధులలో రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అడుగడుగునా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాసాని సుధాకర్, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసులు, డి.కోటేశ్వరరావు, కార్యదర్శి పొత్తంశెట్టి చిన్నసుబ్బారావు, సహాయ కార్యదర్శులు నూనె రామిరెడ్డి, బాసాని ఉమా, కోశాధికారి కేవీ సుధాకర్‌రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.


అమరజవాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

పెద్దారవీడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో అమర జవాన్ మురళీనాయక్‌కు సోమవారం విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వర రెడ్డి మురళీనాయక్ చిత్ర పటం ఏర్పాటు చేశారు. విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చరిత్రను అభ్యసించడం వలన త్యాగధనుల జీవిత చరిత్రలను పఠించవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ


దాత ఇచ్చిన గొడుగులతో చిరువ్యాపారులు

కంభం, మే 12 (ఆంధ్రజ్యోతి) : సోమవారం గౌతమ బుద్ధిని పుట్టినరోజు సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తాటి ముంజలు, దానిమ్మకాయలు అమ్ముకుని జీవిస్తున్న చిరువ్యాపారులకు జీవీ కృష్ణయ్య అనే ఉపాధ్యాయుడు గొడుగులు, చేతిరుమాళ్లను పంపిణీ చేశారు. కృష్ణయ్య మాట్లాడుతూ మండుటెండలో కూర్చుని వ్యాపారం చేసుకుంటున్న వారికి నీడను కల్పించాలనే ఉద్దేశంతో బుద్ధ జయంతి రోజున గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సేవకులు దేవిరెడ్డి నాగేంద్రుడు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, కేతి రామాంజనేయులు, రిటైర్డ్ ఎంఈవో మాధవకృష్ణ, వేల్పుల గోపాల్, కాలె శంకర్, సుబ్బరాజు, వల్లభరావు, రంగనాయకులు

కారు - ఆటో ఢీ

» ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలు
» ప్రమాదం నుంచి బయట పడిన సీడీపీవో కమలకుమారి


ప్రమాదానికి గురైన ఆటో

పెద్ద దోర్నాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న కారు ఆటో ఢీకొని ఆటో బోల్తా పడిన ఘటన స్థానిక భారత్ పెట్రోలు బంక్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా కారులో ప్రయాణిస్తున్న సీడీపీవో కమలకుమారికి గాయాలు కాలేదు. మార్కాపురం నుంచి కారులో సీడీపీవో కమలకుమారి దోర్నాల ఐసీడీఎస్ కార్యాలయానికి వస్తుండగా దోర్నాల నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న ఆటో వేగం అదుపు తప్పి ఢీకొని ఆటో బోల్తా పడింది. ఘటన చూసిన పలువురు వెంటనే స్పందించి ఆటోను లేపారు. పెద్దగా ప్రమాదం జరగక పోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

మార్కాపురం వన్‌టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి వికాస తరంగిణి సంఘం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పేద విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం వెంకటాపురానికి చెందిన ఎస్.పవన్‌కుమార్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి సంస్థలు ఆ విద్యార్థికి తమ వంతు సహకారంగా ల్యాప్‌టాప్‌ను అందించారు. కార్యక్రమంలో డా. డీవీ కృష్ణారెడ్డి, డా. కనకదుర్గ, గుంటక వనజాక్షి, వరలక్ష్మీ, రామకృష్ణ పాల్గొన్నారు.


ల్యాప్‌టాప్‌ను బహూకరిస్తున్న దాతలు

చీకటిపడితే బిక్కుబిక్కు!

» గుండ్లకమ్మ బ్రిడ్జిపై వెలగని వీధి దీపాలు
» వైద్యశాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్న ప్రజలు


గుండ్లకమ్మ బ్రిడ్జిపై వెలగని వీధిదీపాలు

మార్కాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంతోపాటు డివిజన్‌లోని అన్ని మండలాల నుంచి వచ్చే రోగులకు కీలకమైనది ప్రభుత్వ సర్వజన వైద్యశాల. స్థానిక గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న ఈ వైద్యశాలకు రాత్రి సమయాల్లో చేరుకోవాలంటే రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. గుండ్లకమ్మ బ్రిడ్జిపై ఉన్న వీధి దీపాలు నెలలుగా వెలగడం లేదు. మున్సిపాలిటీలో అంతర్భాగం కాకపోయినా ప్రజా ప్రాధాన్యత దృష్ట్యా దశాబ్దాలుగా పురపాలక ఇంజనీరింగ్ అధికారులే వైద్యశాల వరకు వీధి దీపాల నిర్వహణ చూస్తున్నారు. అప్పట్లో బ్రిడ్జిపై రాకపోకలు సాగించే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం హైమాక్స్ వీధి దీపాలను అమర్చింది. సుమారు 10 వరకు పోల్స్ ఉన్నా ప్రస్తుతం వెలుగుతున్నది కేవలం రెండు మాత్రమే. రాత్రి సమయాల్లో రోగులతోపాటు అటుగా ప్రయాణం సాగించే వాళ్లు బ్రిడ్జి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. వైద్యశాలలో పని చేసే కొందరు సిబ్బంది సైకిళ్లపై కూడా వస్తూ పోతుంటారు. అలాంటి వాళ్లు రాత్రి ఆసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడాల్సివస్తోంది. అంతేకాక గుండ్లకమ్మ బ్రిడ్జిపై అక్కడక్కడా గుంతలు కూడా ఉన్నాయి. వెలుతురు లేకపోవడంతో చిన్నపాటి వాహనాలపై వెళ్లేవాళ్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను చాలామంది మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదు. రూ.లక్షల మేర పట్టణంలో వీధి దీపాల నిర్వహణకు ఖర్చు చేస్తోన్న మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం కీలకమైన వైద్యశాలకు వెళ్లే ప్రాంతంలో మరమ్మతులు చేయడానికి చొరవ చూపకపోవడం శోచనీయం.

వెంటనే పరిశీలించి వీధి దీపాలను పునరుద్ధరిస్తాం

గుండ్లకమ్మ బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగని విషయం మా దృష్టికి రాలేదు. అన్ని స్తంభాలపై ఉన్న వీధి దీపాలను పరిశీలించి తప్పక మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే నూతనంగా లైట్లు ఏర్పాటు చేస్తాం. వాస్తవానికి పెద్దపాటి స్తంభాలు కావడంతో వర్కర్లు ఎక్కి చేసే అవకాశం లేదు. ఎక్స్‌కవేటర్ సాయంతో మాత్రమే ఆ స్తంభాలపై ఉన్న లైట్లను పరిశీలించే అవకాశం ఉంది.

- భూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ

వైభవంగా బుద్ధ జయంతి


గౌతమ బుద్ధుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భక్తులు

గిద్దలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రి మాత ఆలయంలో బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమే కాకుండా పూజలు చేశారు. రాజరికానికి దూరంగా ఉంటూ 29 ఏళ్ల వయస్సు ఇంటిని వదిలి పెట్టి సన్యాసం స్వీకరించి సత్యాన్వేషణకై బోధి వృక్షం కింద కూర్చుని 49 రోజులు కఠోరమైన ధ్యానం చేసి జ్ఞానం పొందారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన బోధించిన జ్ఞానాన్ని ధర్మచక్ర ప్రవర్తన అంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా సామూహికంగా గాయత్రిమాత యజ్ఞం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేమన తపోవనం వ్యవస్థాపకులు పి.హనుమంతరెడ్డి, యో గా గురూజీ నారాయణరెడ్డి, గాయత్రి పరివార్ సభ్యులు వీరారెడ్డి, కాశిరెడ్డి, బాలిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో వీరభద్రస్వామి

వైభవంగా వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం


పెద్దారవీడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులక్కపల్లిలోని శ్రీ వీరభద్రస్వామి వారి దేవస్థాన నాల్గవ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద పండితులు పిరుగుపల్లి సుబ్రమణ్య శర్మ స్వామి వారికి అభిషేకానంతరం ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ వీరభద్రస్వామికి కుంభాభిషేకం, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

రీ-సర్వేను వినియోగించుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్ మే 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నిర్వహించే భూ రీ-సర్వేలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రగొండపాలెం తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నరసాయపాలెంలో ప్రజలతో సమావేశం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూముల వివరాలను పూర్తి స్థాయిలో సర్వే చేయడం వలన రైతులకు ఎలాంటి సమస్యలు ఉండవని అన్నారు. కావున బుధవారం నుంచి గ్రామంలో గ్రామంలో జరిగి ఈ భూ రీసర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సైదారావు, గ్రామ సర్పంచ్ చిమట వెంకటరామయ్య, వీఆర్వోలు రాంబాబు, డేవిడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లిలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణ, భేరి పూజ, దేవతాహ్వానం, రాయబారం, ఎదురుకోల కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


రియాజ్‌ను అభినందిస్తున్న జనసేన పార్టీ నేతలు

రియాజ్‌కు అభినందనలు

మార్కాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ ఏజెన్సీ చైర్మన్‌గా ఎంపికైన ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను మార్కాపురం జనసేన నాయకులు సోమవారం మంగళగిరిలో కలిశారు. కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమి టీ డైరెక్టర్ మీర్జా అబిద్ హుస్సేన్‌బేగ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నా యబ్ కమాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్, ఏపీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, షేక్ ఖాదర్ జహీర్ పాల్గొన్నారు.

పొదుపు సొమ్ము తిరిగి చెల్లించేలా చర్యలు

పెద్ద దోర్నాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం ఎం వెంకిరెడ్డి అన్నారు. వెలుగు కార్యాలయంలో వీవోఏలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానంగా స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను వంద శాతం తిరిగి రాబట్టాలన్నారు. కార్యక్రమంలో సీసీలు మోహన్‌రావు, శ్రీనివాసులు, అరుూంటెంటు మల్లీశ్వరి పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఎం వెంకిరెడ్డి

మైనర్ లాంగ్వేజీ చదివే విద్యార్థులకు, పాఠశాలలకు న్యాయం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మైనర్ లాంగ్వేజీని చదివే విద్యార్థులకు, పాఠశాలలకు న్యాయం చేయాలని పండిత పరిషత్ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న హేతుబద్ధీకరణ ప్రక్రియ వలన విద్యార్థులకు పాఠశాలలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య ద్వారా సెక్షన్‌లను నమోదు చేయడంలో అవగాహన లోపం వల్ల ఉర్దూ, సంస్కృతం తదితర మైనర్ లాంగ్వేజీలను చదివే పిల్లలను ప్రత్యేకంగా చూపించకపోవడంతో ఉర్దూ, సంస్కృత పోస్టులతో పాటు తెలుగు పోస్టులు కూడా పోతున్నాయని తెలిపారు. 26వ సెక్షన్ దగ్గర 5వ తెలుగు పోస్టు వస్తుందని ప్రభుత్వ నిబంధనలు ఉండగా, కేవలం 4 పోస్టులు మాత్రమే కేటాయిస్తుండడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యల వలనఅనేక పాఠశాలలు నష్టపోతాయని, మైనర్ లాంగ్వేజీ విద్యార్థులు కలిగిన పాఠశాలల్లో నమోదుకు అవకాశం కల్పించి పోస్టులు పోకుండా చూడాలని, పాఠశాలలకు న్యాయం చేయాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


పోస్టుకార్డులను చూపుతున్న రైతులు, నాయకులు

చిన్న కండ్లేరు పనులు చేపట్టాలి

సీఎంకు పోస్టు కార్డులు పంపిన రైతులు

పుల్లలచెరువు, మే 12 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరుకు అనుసంధానం పనులను వెంటనే చేపట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం మండలంలోనికవలకుంట్లలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపంచారు. ఈ రందర్భంగా వారు మాట్లాడుతూ తీగలేరు కాలువకు 2017లో సర్వే పూర్తి అయినా నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కరువు పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు 5 కాలువను పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు రిజర్వాయరు వరకు పొడిగించాలని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, డీ శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, రైతు సంఘం నాయకులు జానకీ రఘు, కుందురు కోటిరెడ్డి, బాణాల రామయ్య, పిచ్చిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం

గిద్దలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తిరునాళ్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు సోమవారం గరుడోత్సవం, ఊయల సేవ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. మహిళలకు పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమం లక్కీ డిప్ ద్వారా ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ ప్రతినిధులు, నియోజకవర్గ దేవాలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

20 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

గిద్దలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రేడియో బావి సెంటర్‌లో గల శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుంచి 22వ తేది వరకు హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ మంగళవారం గణపతిపూజ, ఆంజనేయస్వామికి అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం లక్ష తమలపాకుల పూజ, 21న స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం, సహస్ర నామ పూజ, సాయంత్రం పుష్పాభిషేకం, 22న సుప్రభాతసేవ, సర్వదర్శనం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై అదాలత్

పొదిలి, మే 12 (ఆంధ్రజ్యోతి) : కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దర్శి రోడ్ మంజునాథ కల్యాణమండపంలో విద్యుత్ అదాలత్ జరుగుతుందని పొదిలి ఏడీఏ హరిబాబు తెలిపారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతందని కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే వెంకటేశ్వర్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. దర్శి డివిజన్ పరిధిలో పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు సర్వీస్ కనెక్షన్, పూర్తి అడ్రస్సు, సెల్ నెంబర్‌తో అర్జీ ఇవ్వాలనాన్నారు. సమస్యను క్లుప్తంగా రాయాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, మీటర్‌లో సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించి తెలియజేయాలన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

ముగ్గురు చిన్నారులకు గాయాలు


మనోజ్‌ను కరిచిన కుక్క

పెద్దారవీడు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.కొత్తపల్లిలో సోమవారం ఉదయం పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. తాజాగా ముగ్గురు చిన్నారులను కుక్కలు కరిచాయి. పిచ్చి కుక్కలు కరవడంతో చిన్నారులు పాలూరి వరుణ్, కర్ణమాల శ్రేయాంశ, మనోజ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ముగ్గురు చిన్నారులను కుటుంబసభ్యులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పిచ్చి కుక్కలు గ్రామంలో తిరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరకు గ్రామస్థులు ఏకమై కర్రలతో పిచ్చి కుక్కలను తరిమివేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు


గాయపడిన తిరుపతిరెడ్డి

కంభం, మే 12 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం తురిమెళ్ల గ్రామం నుంచి కంభం పోలీసుస్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపు తప్పి కిందపడడంతో ఏఆర్ కానిస్టేబుల్ మాదిరెడ్డి తిరుపతిరెడ్డి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ఉదయం జరిగింది. ఎస్ఐ నరసింహారావు కథనం ప్రకారం బేస్తవారపేట మండలం గలిజేరుగుళ్ల గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి మండలంలో డ్యూటీపై తురిమెళ్ల వెళ్లి వాహనాల తనిఖీకి కంభం వస్తుండగా పోరుమామిళ్లపల్లి సమీపంలోని మూలమలుపులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో తిరుపతిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. 108కి సమాచారం అందించగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరుకు తరలించినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

విద్యార్థులకు చెస్‌లో శిక్షణ


చెస్ నేర్చుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు చెస్ ఆటను నేర్పించారు. క్యారమ్స్, స్కిప్పింగ్, పరమసోపాదం లాంటి ఇండోర్ గేమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. కథలు చదివి చెప్పడం, ఇంగ్లీష్ గ్రామర్ నేర్పడం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీలు రామిరెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ముఖాముఖి

భూసార పరీక్షలతో ప్రయోజనం

కె.ప్రకాశరావు, ఏవో, పీసీపల్లి



ప్రశ్న: భూసార పరీక్షల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనం ఏంటి?

జవాబు: భూసార పరీక్షలు చేయించడం ద్వారా నేల స్వభావం తెలుస్తుంది. భూమిలో ఆమ్ల, క్షార గుణాలు, సూక్ష్మ పోషకాలు ఎంత శాతం ఉన్నాయో తెలుసుకోవచ్చు.

ప్ర: ఇప్పటివరకు భూసార పరీక్షల కోసం శాంపిల్స్ ఎన్ని తీశారు?

జ: మండలంలో 750 శాంపిల్స్ తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 372శాంపిల్స్ తీశాం. ఒక్కో రైతు సేవాకేంద్రం పరిధిలో 50వరకు శాంపిల్స్ తీస్తున్నాం.

ప్ర: భూసార పరీక్షల ఫలితాలు ఎన్ని రోజుల్లో వస్తాయి?

జ: పొలంలో మట్టి నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపించిన 15 రోజుల్లో ఫలితాలు వస్తాయి.

ప్ర: వేసవి దుక్కుల వల్ల ప్రయోజనాలు ఏంటి?

జ: వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూమిలో నిద్రావస్థ దశలో ఉన్న పురుగులు, శిలీంధ్రాలు బయటపడి సూర్యరశ్మికి నశిస్తాయి.

ప్ర: పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు ఇస్తున్నారా?

జ: రైతుసేవా కేంద్రాలలో గ్రామీణ వ్యవసాయ సహాయకులను కలిసి రైతులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తాం.

ముండ్లమూరు ఎంపీడీవోగా సునీత బాధ్యతల స్వీకరణ



ముండ్లమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఎంపీడీవోగా పి.సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా కొల్లూరులో ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ముండ్లమూరు ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన ఆర్. జనార్దన్ తిరిగి ఈవోపీఆర్డీగా విధుల్లో చేరారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సునీత మాట్లాడుతూ మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకొని మండలాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యాలయ సూపరింటెండెంట్ బి.కల్పన సీనియర్ అసిస్టెంట్ మురళి, అంతరయ్య సునీతను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి

సీఎస్‌పురం(పామూరు), మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సక్రమంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని చెన్నపు నాయినిపల్లి గ్రామ సచివాలయాన్ని సోమవారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మైలుచర్ల గ్రామంలో కొత్తగా రేషన్, ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పించారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచించారు. సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. 90 రోజుల పాటు శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌తోపాటు ఉచితంగా కుట్టు మిషన్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, స్రవంతి, షేక్ ఖాజాబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), మే 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం హుండీ ఆదాయం రూ.2,16.060 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. మురగమ్మికు చెందిన గోదురు ఆదినారాయణ, వినీత దంపతులు స్వామి వారికి వెండి శఠగోపురం సమర్పించినట్లు ఏవో తెలిపారు.

ఆటో బోల్తాపడి దంపతులకు గాయాలు

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం కందుకూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆటో బోల్తాపడి భార్యాభర్తలు దేవ, సుస్మితలకు గాయాలయ్యాయి. వారిద్దరిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన దంపతులు కందుకూరుకు చెందినవారు. వ్యక్తిగత పనుల నిమిత్తం చిలకలూరిపేట వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది.

వైభవంగా అంకాలమ్మ జాతర

- మారెళ్లకు పోటెత్తిన భక్తులు
- పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం

ముండ్లమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ అమ్మవారి 62వ జాతర మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది మే నెలలో అమ్మవారి జాతర నిర్వహిస్తుంటారు. ఇళ్ల వద్ద పొంగళ్ళు పెట్టుకొని నైవేద్యం, వడ పప్పును ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించటం ఆనవాయితీ. గ్రామానికి చెందిన పాశం వంశస్థులు అంకాలమ్మ తల్లిని కుటుంబ బిడ్డగా భావించి పసుపు కుంకుమతో పాటు చీర ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించిన తర్వాత ఆలయ ప్రధాన అర్చకులు భక్తులను పూజలకు అనుమతిస్తారు. మారెళ్ళ గ్రామానికి చెందిన భక్తులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందినవారు కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. అంకాలమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా టీడీపీ, జనసేన, కృష్ణ బలిజ సంఘం నాయుడు యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ అమ్మవారు



జాతరలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ



అంకాలమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చూశారు. సుంకర రాఘవరెడ్డి, పాశం వెంకటేశ్వరరావులు పట్టు వస్త్రాలతో ఆమెను సన్మానించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.కమలాకర్, తాళ్ళూరు ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సుంకర రాఘవరెడ్డి, మట్టా సుబ్బారెడ్డి, పాలపర్తి సుబ్బారావు, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవిత కేంద్రం

- సమీప పాఠశాలలోకి విలీనం
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మూతపడిన భవిత కేంద్రం

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలోఉన్న భవిత కేంద్రం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరింది. దివ్యాంగ చిన్నారులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే ఆశయంతో ప్రవేశపెట్టిన భవిత కేంద్రం మూతపడింది. దాంతో కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులను సమీప ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు.

స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ప్రక్కన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు) సర్వశిక్ష అభియాన్ నిధులతో నిర్మించారు. అయితే, గదుల్లో ఫ్లోరింగ్ కృంగిపోవడం, గోడలు నెర్రలు వారింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఫ్లోరింగ్ మరమ్మతులు చేసేందుకు తగిన నిధులు లేకపోవడంతో పనులు చేపట్టలేదు. భవిత కేంద్రంలో సుమారు 25 మంది పిల్లలు ఉన్నారు. వారి సంరక్షణ కోసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఎస్సీ పాఠశాలో సుమారు 35 మంది విద్యార్థులకు సరిపడ గదులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో భవిత పిల్లలను కూడా చేర్చడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యేక అవసరాల పిల్లలతో పాఠశాల విద్యార్థులు ఇమడలేక పోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి భవిత కేంద్రానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అరకొరగా గుంతల పూడ్చివేత

- ఆర్‌డబ్ల్యూఎస్ నిర్లక్ష్యవైఖరి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దర్శి, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరితో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దర్శి పట్టణంలో పైపులైన్ల మరమ్మతుల కోసం తీసిన గుంతలను సక్రమంగా పూడ్చకపోవటంతో వాహనచోదకులు ఆ రోడ్లలో వెళ్లే వీలులేక ఇబ్బందులు పడుతున్నారు. వారంరోజుల క్రితం దర్శి-కురిచేడు రోడ్డులో దర్శి-పొదిలి రోడ్డులో ఎన్‌ఏపీ ప్రధాన పైపులైన్లు పగిలిపోవటంతో మరమ్మతులు చేసేందులు గుంతలు తీశారు. పగిలిన పైపులైన్లు మరమ్మతులు చేసి అరకొరగా మట్టి వేశారు. ఆ ప్రదేశాల్లో సిమెంట్ దిమ్మెలు, రాళ్ల తొలగించకుండా చదును చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో వాహన చోదకులు ఆ రహదారుల్లో వెళ్లే వీలులేకుండా పోయింది. పైపులైన్లు మరమ్మతులు చేసిన తర్వాత అధికారులు రోడ్లను చదును చేయకుండా వదిలేయటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దద్దాలమ్మ గుడి వద్ద ఎన్ఏపీ పైపులైన్ మరమ్మతులుచేసి సక్రమంగా పూడ్చని గుంతలు

నిరుపయోగంగా బస్సు స్టేషన్

- చిల్లచెట్లతో మూసుకుపోయిన ప్రాంగణం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

ముండ్లమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని బస్సు స్టేషన్ నిరుపయోగంగా మారింది. చిల్లచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. పట్టించు కోవాల్సిన ఆర్టీసీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటంలేదు. 1989లో అప్పటి మార్టూరు ఎమ్మెల్యే కరణం బాలరామకృష్ణమూర్తి ప్రతి మండల కేంద్రంలో బస్సు స్టేషన్ ఉండాలన్న ఉద్దేశంతో రూ.పది లక్షలు నిధులు మంజూరు చేయించి నిర్మించారు. దశాబ్ద కాలం బస్సు స్టేషన్ వాడుకలో ఉంది. ఆతరువాత అద్దంకి, పొదిలి డిపోలకు చెందిన బస్సులు స్టేషన్‌కు రాకపోవటంతో క్రమేణా నిరుపయోగంగా మారింది. దీంతో రాత్రుల సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది.



చిల్లచెట్లతో మూసుకుపోయిన ముండ్లమూరు బస్సు స్టేషన్

పగలు మాత్రం యాచకులు తలదాచుకుంటున్నారు.

బస్సు స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఆస్పత్రికి నిత్యం రోగులు వచ్చిపోతుంటారు. దీంతో రోగులు మందుబాబులతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్సు స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

- అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న 22 మందిపై కేసు నమోదు

ముండ్లమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించింది. ఈసందర్భంగా 22 మంది అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నట్టు గుర్తించి రూ2.19 అపరాధ రుసుం విధించినట్టు డీపీఈ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వీవీ ఉషారాణి తెలిపారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురికి రూ.1.60 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా అదనంగా ఇతర కేటగిరితో విద్యుత్ వాడుకుంటున్న ఐదుగురికి రూ.28 వేలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన రెండు సర్వీసులను గుర్తించి రూ.10 వేలు, మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరికి రూ.4 వేలు అపరాధ రుసుం విధించినట్టు ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, డీఈఈ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, హరిబాబు, ఏఈ అంకబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడు తున్న విజిలెన్స్ అధికారిణి ఉషారాణి

భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కొత్తచెరువు బాలసుబ్బయ్య నగర్ వద్ద గల పట్టా భూములను కొందరు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారన్నారు. వారిపై చర్యలు తీసుకొని సర్వే చేయించి మా భూములను కాపాడాలని పట్టాదారులైన రైతులు సిద్ధవటం పెదమాల కొండయ్య, రాచూరి నరసింహారావు, సిద్ధవటం మాల్యాద్రి, చినమాలకొండయ్య, మాల్యాద్రి, సోశం సూర్యచంద్రరావు, వెంకటరమణయ్య కోరారు. సర్వేనెంబర్ 398/1లో 32.22 ఎకరాలు, 398/3లో 12.50 ఎకరాలు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో సర్వేయర్‌తో భూమి కొలతలు వేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కాగా సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై పలు అర్జీలు ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధిత రైతులు



ముస్తాబైన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

రేపటి నుంచి ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

దొనకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి బ్రహ్మణపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 14 నుంచి 16వ తేది వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. గ్రామ పురోహితులు రెంటచింతల సత్యనారాయణశర్మ, బద్వేలు వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామశర్మ ప్రధాన కలశ స్థాపన, ప్రాతఃకాల పూజ, ప్రతిష్ఠ హోమం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో పాల్గొని శ్రీప్రసన్నాంజనేయస్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి, దీవెనలు పొందాలని గ్రామస్థులు కోరారు.

వీవోఏపై చర్యలు తీసుకోవాలి

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పామూరు క్లస్టర్ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన పొదుపు సొమ్ముతో ఉడాయించిన వీవోఏపై చర్యలు తీసుకోవడంలో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట బాధిత పొదుపు గ్రూపు మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సొమ్ముతో పరారైన విషయం గతనెల 20న వెలుగులోకి వచ్చినా ఇంతవరకు వీవోఏపై చర్య తీసుకోవడంలో వెలుగు అధికారుల అలసత్వం వహిస్తున్నారని అన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం జి. విద్యాసాగర్‌ను కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు సాగు చేస్తున్నట్టు వగ్గంపల్లి గ్రామ రైతులు తెలిపారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసి కూరగాయలు వాడకం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని రైతులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి, కందుల రమణయ్య, శ్రీను తెలిపారు. మార్కెట్ ధరకన్న తక్కువగా విక్రయిస్తున్నట్టు తెలిపారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన కూరగాయలను విక్రయిస్తున్నట్టు వారు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు



దర్శిలో వాహనాలను తనిఖీలు చేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారులు

దర్శి, మే 12(ఆంధ్రజ్యోతి): వాహనాల చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని దర్శి మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో సోమవారం ఆర్టీసీ అధికారులతో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా పలు ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటంతో కేసులు నమోదు చేశారు. రికార్డులు పరిశీలించి సక్రమంగా లేని వాహనాలు గుర్తించారు. నిబంధనలు పాటించని వాహనాలకు రూ.25వేలు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ఆర్టీసీ అధికారులు ఎస్‌వీ రావు, షరీఫ్, రామయ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న బొప్పాయి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): అకాల వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి తోటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలుగు రైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య కోరారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి అయ్యవారిపల్లి గ్రామంలో 5 ఎకరాల్లో సాగు చేసిన బొప్పాయి చెట్లు నెలకొరిగి దెబ్బతిన్నాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. కార్యక్రమంలో ఏలూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రుణాలు చెల్లించకపోతే చర్యలు

పామూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): సక్రమంగా రుణాలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో కె.శివనాగప్రసాద్ హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ పనిముట్లు తీసుకొన్న గ్రూపు సభ్యులు సక్రమంగా రుణాలు చెల్లించడం లేదు. గత 2021లో అనర్హులు వ్యసాయ యాంత్రిక పనిముట్లు తీసుకొని నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులు వచ్చాయి. ఈక్రమంలో సోమవారం పలు గ్రామాల్లో ఆయన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా రుణాల రికవరీ సక్రమంగా లేనివారికి నోటీసులు జారి చేశారు. కార్యక్రమంలో ఏవో కె.రాధ, వీఏఏలు, సీహెచ్‌సీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు మృతి

కురిచేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వాహన చోదకులు మృతిచెందాడు. ఈఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని వెంగాయపాలెం వద్ద చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ఆవులమంద గ్రామానికి చెందిన పల్లె డేవిడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఆదివారం రాత్రి తన కుమార్తె ఓణీల ఫంక్షన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాడు. స్వగ్రామంలో చర్చి పండుగ సందర్భంగా విద్యుత్ లైట్లు అవసరమై వినుకొండ నుంచి లైట్లు తీసుకుని వస్తున్నాడు.

ఈక్రమంలో వెంగాయపాలెం గ్రామం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ సంభాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డేవిడ్ మృతదేహాన్ని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరిశీలించారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

తాళ్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. తాళ్లూరు-1 రైతు సేవాకేంద్రం పరిధిలో పండిం చిన మేలుజాతి రకం యలమంచలి-66రకం నువ్వు పంటను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో జీపీపీ కోఆర్డినేటర్ ఏఈవో కోట హరిప్రసాద్, వీఏఏ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన బూచేపల్లి

ముండ్లమూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త మాల్యాద్రి గుండె పోటుతో సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి గ్రామానికి వెళ్ళి మాల్యాద్రి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, శరత్ తదితరులు ఉన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా) 13-5-2025

	గరిష్టం	కనిష్టం
గుంటూరు	42	28
తెనాలి	42	28
నరసరావుపేట	41	27
బాపట్ల	39	29
రెంటచింతల	42	28
చీరాల	39	29

రాయితీ పథకం.. లక్ష్యానికి దూరం

- సబ్సిడీ యంత్రాలపై అన్నదాతల అనాసక్తి!
- ధరల్లో భారీగా తేడా ఉండడమే కారణమా?
- ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాని వైనం



రాయితీపై సేద్య పరికరాలను అందించే విధానాన్ని గత ప్రభుత్వం పూర్తిగా తెరమరుగు చేసి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టింది. ఈ ప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించింది. రాయితీ పొందడానికి మార్గదర్శకాలు విడుదల చేయడమే కాకుండా మూడు జిల్లాలకు నిధుల కేటాయింపు, పరికరాల లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. మామూలుగా అయితే రాయితీ పరికరాల కోసం రైతాంగం నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు రావాల్సి ఉంది. కానీ అనూహ్యంగా స్పందన అంతంతమాత్రంగా ఉండడమే కాకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే వ్యవసాయశాఖ ఆపసోపాలు పడాల్సి వచ్చింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 10,000 నుంచి 50,000 వరకు ఉంది. అది పోను మిగిలిన మొత్తాన్ని అన్నదాతలు చెల్లించి పరికరాలను పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కానీ ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీల మాయాజాలం నడిచినట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కూడా కలుపుకుంటే బయటిమార్కెట్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు రైతులు గుర్తించారు. నిజానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. కానీ

జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా..

ఐదేళ్ల పాటు అమలుకు నోచుకోని రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విధివిధానాలను మూడు నెలల క్రితమే జారీ చేయడంతో పాటు జిల్లాల వారీగా లక్ష్యాలనూ నిర్దేశించింది. బాపట్ల జిల్లాకు సంబంధించి కేటాయించిన నిధులు రూ.2.70 కోట్లు కాగా అందించాల్సిన యూనిట్లను 1,400గా తెలిపింది. అదే విధంగా గుంటూరు జిల్లాకు వచ్చేసరికి నిధులు రూ.2.60 కోట్లుకాగా యూనిట్ల సంఖ్య 1,410గా ఉంది. పల్నాడు జిల్లాలో నిధులు రూ.2.75 కోట్లు కాగా యూనిట్ల సంఖ్యను 1,470గా వ్యవసాయశాఖ ప్రకటించింది. అవసరాన్ని బట్టి నిధుల పెంపుపై కూడా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది.

బ్రాండెడ్ లేదా గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం రాయితీ యంత్ర పరికరాలపై ఆది నుంచి విముఖత ప్రదర్శిస్తూనే ఉన్నారు. మండలాల వారీగా అధికారులకు నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చి వాటిని పూర్తి చేయాలని మెడమీద కత్తిపెట్టి వ్యవసాయశాఖ పనిచేయించింది. మార్చి చివరికే తుది గడువుగా తొలుత ప్రకటించిన ప్రభుత్వం స్పందన నిరాశజనకంగా ఉండడంతో గడువును పెంచుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంతో దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేసినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. మూడుసార్లు గడువు పొడిగించినా, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినా పరికరాల లక్ష్యం చేరుకోవడంలో మాత్రం వ్యవసాయశాఖ వెనకబడే ఉంది. రాయితీ కోసం ఎగబడాల్సిన రైతాంగం దానిని కాదనుకునే విధంగా వ్యవహరించడం వెనక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పనే వ్యవసాయశాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించడంపై వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. పైగా అన్నదాతల దగ్గర డబ్బులు లేక పోవడం కూడా లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణంగా ఉందనే వాదనను యంత్రాంగం చేయడం విస్తుగొలిపే విధంగా ఉంది

లోపం ఎక్కడ జరిగింది...

రోటోవేటర్ ధరలు కనిష్టంగా రూ.80,000 దగ్గర నుంచి రూ.1,50,000 వరకు ప్రభుత్వం మార్గదర్శకాలలో పేర్కొంది. ఇందుకు సంబంధించి రైతుకు అందే రాయితీ రూ.50,000 వరకు ఉంది. సబ్సిడీపోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయటి మార్కెట్ కన్నా కూడా రూ.30,000 వరకు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అన్నదాతకు సబ్సిడీ వచ్చినా కానీ చెల్లించే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉండడమే ఈ స్థితికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.



వందశాతం చేరుకోవడంలో విఫలం..

జిల్లాల వారీగా కేటాయించిన నిధులే అంతంతమాత్రంగా ఉంటే గడువు పూర్తయ్యేసరికి ఎక్కడా కూడా వందశాతం లక్ష్యాలను చేరుకున్న దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాకు మంజూరు చేసిన 1,400 యూనిట్లకు 1100కు మాత్రమే అనుమతులు మంజూరు అయ్యాయి. రూ.2.10 కోట్ల నిధులనే యంత్రాంగం ఖర్చు చేయగా ఇంకా రూ.60 లక్షల నిధులు అలానే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోకూడా కేటాయించిన నిధులు, యూనిట్లు మంజూరులో కూడా 75 శాతమే చేరుకున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఐదేళ్ల పాటు మూలన పడేసిన ఓ పథకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తే వేలల్లో దరఖాస్తులు రావాల్సి ఉండగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడమే గగనమై పోయింది.



చిన్నారులపై.. వాత్సల్యం!

అనాథ పిల్లలను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. 'మిషన్ వాత్సల్య' పేరుతో అనాథ పిల్లలకు నెలనెలా ఆర్థిక సహాయం అందించడంతోపాటు, వారి సంరక్షణకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా తాజాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసింది. దీంతో అనాథ పిల్లలకు గొప్ప భరోసా లభించినట్లయింది.

- 'మిషన్‌వాత్సల్య' పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- అనాథ, నిరుపేద పిల్లలకు నెలకు రూ. 4వేల ఆర్థిక సహాయం
- తన వాటాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత అంగన్వాడీలదే!

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): 'మిషన్ వాత్సల్య' అనేది కేంద్ర ప్రాయోజిత పథకం. ఈ పథకాన్ని 2021 లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని అనాథలైన చిన్నారులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ వాత్సల్య'కు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం తనవంతు వాటాగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ. 19.12 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో పథకం అమలు లాంఛనప్రాయమయింది.

నెలకు రూ. 4వేలు ఆర్థిక సహాయం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనాథ చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తారు. ఆదరణ లేని అభాగ్యులు, అనాథ బాలలకు విద్య, వైద్య అవసరాలు తీర్చడం కోసమే ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుంది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా నిధుల కోసం కేంద్రానికి ప్రభుత్వం సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

● అర్హులు ఎవరంటే..

బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం సంరక్షణ ఆదరణ అవసరమైనవారు ఈ పథకానికి అర్హులవుతారు. వితంతువులు, లేదా విడాకులు తీసుకున్న తల్లి సంరక్షణలో ఉండే పిల్లలు, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి ఇతరుల వద్ద ఆశ్రయం పొందుతున్న అనాథలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లి దండ్రుల బిడ్డలు, పోషించే స్థోమతలేని తల్లిదండ్రుల పిల్లలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, అక్రమరవాణాకు గురైనవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన, యాచక చిన్నారులు, వీధుల్లో నివసిస్తున్న, హింసకు, దోపిడీకి గురైన చిన్నారులు, అనాథాశ్రమాల్లో ఉంటూ మద్దతు పునరావాసం అవసరమైన పిల్లలు ఈ పథకానికి అర్హులుగా ఉంటారు.

● అర్హతలు ఇలా..

మిషన్ వాత్సల్య పథకం కోసం దరఖాస్తు చేసేవారి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.98 వేలకు మించి ఉండకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం వర్తించేవారికి ఈ పథకం వర్తించదు.

● పరిశీలన ఇలా..

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. రాష్ట్రంలో 'తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా, విడాకులు తీసుకున్న, కుటుంబాన్ని వదిలేసిన తల్లిదండ్రుల పిల్లలు, ప్రాణాంతక వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలకు, అక్రమ రవాణా, దాడులకు గురైన పిల్లలు అర్హులు'గా గుర్తిస్తారు. 18 ఏళ్ల వరకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఈ పథకం కింద ఆరు నెలలకు ఒకసారి, మూడు నెలలకు ఒకసారి నిధుల్ని విడుదల చేస్తారు.

● అంగన్వాడీలపై బాధ్యత

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ పరిధిలో కార్యకర్తలు మిషన్ వాత్సల్య పథకం గురించి ప్రచారం చేయాల్సి ఉంటుంది. అర్హులైన చిన్నారులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉంటుంది. క్రమం తప్పకుండా యాప్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తించిన అనాథ పిల్లలు, అర్హులైన చిన్నారుల సంరక్షకులతో మాట్లాడి దరఖాస్తు చేసుకునేలా అంగన్వాడీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలి.

అవిశ్వాసం కాక..!

- మూడో వంతు కౌన్సెలర్ల మద్దతు కోసం జంజనం ఆపసోపాలు
- మద్దతు కోసం మంగళగిరి చుట్టూ ప్రదక్షిణలు
- రేపు వీడనున్న ఉత్కంఠ

చీరాల, మే 12 (ఆంధ్రజ్యోతి): చీరాల మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం అంశం ఉత్కంఠ రేపుతోంది. మరో రెండురోజుల్లో జంజనం నెగ్గుకొని వస్తారా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొంతకాలంగా ఈ వ్యవహారం తారస్థాయిలో చర్చనీయాంశంగా సాగుతుంది. నిన్నమొన్నటి వరకు వైసీపీలో ఉన్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తద్వారా తన పదవికి భరోసా ఉంటుందని భావించారు. అయితే చైర్మన్‌గా ఆయన్ను కొనసాగించేందుకు టీడీపీ కౌన్సిలర్లు ససేమేరా అంటున్నారు. దీంతో ఎమ్మెల్యే సైతం తాను టీడీపీ కౌన్సిలర్లకే మద్దతు ఉంటానని వారి నిర్ణయమే తన నిర్ణయం అని జంజనంకు రిక్తహస్తం చూపారు. దీంతో ఆయన తన వర్గాన్ని నిలుపుకొనే ప్రయత్నం చేస్తూనే, టీడీపీ కౌన్సెలర్ల మద్దతు కోసం మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు మంగళగిరి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అయినప్పటికీ, ఆయన మంత్రి అపాయింట్‌మెంట్ లభించలేదని తెలిసింది. ఒకవేళ తనకు లోకేశ్ నుంచి సానుకూల స్పందన లేకపోతే జజనం తన వర్గాన్ని గైర్హాజరు చేయించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే కొండయ్య అవిశ్వాసం ప్రవేశపట్టిన కౌన్సిలర్‌లతో ఆదివారం రాత్రి విందుకు హాజరయ్యారు. ముఖ్యమైన అంశాలు చర్చించుకున్నట్లు భోగట్టా. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సైతం శనివారం రాత్రే తన మద్దతు కౌన్సిలర్లు, కేడర్‌తో సమావేశం నిర్వహించారు. వీరు అభివృద్ధే ముఖ్యమంటూ సమయానుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఓ కౌన్సెలర్ మిగిలిన కౌన్సిలర్లను మెప్పించే పనిలో ఉన్నారు. ఈ విధంగా చూసుకుంటే 33మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు కలుపుకొని మొత్తంగా 35 ఓట్లు పురపాలకంలో ఉన్నాయి. అయితే ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జంజనంకు 1/3 అంటే 13 ఓట్లు మాత్రమే అవసరం ఉండగా, నూతనంగా అధికారం నెగ్గాలంటే వారికి 2/3 అంటే కనీసం 23ఓట్లు ఉండాల్సి ఉంది. ఈక్రమంలో ప్రస్తుతం ఎవరి వ్యూహంలో వారు బిజీబిజీగా ఉన్నారు. ఈక్రమంలో ఎత్తులు పైఎత్తు, పొత్తులు, ప్రతివ్యూహాలు వ్యవహారం 14న జరిగే అవిశ్వాసంతో ఒక స్పష్టత రానుంది.

పులకరించిన భావపురి

- వైభవంగా భావదేవుని రథోత్సవం
- భావదేవ పాహిమాం..అంటూ మారుమోగిన పట్టణం
- రథోత్సవం ప్రారంభించిన దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఇతర నేతలు
- రథం లాగేందుకు పోటీపడ్డ భక్తులు

బాపట్ల,మే12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1,432వ వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగు తున్నాయి. సోమవారం బావయ్య వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించి, రథం బజారు నుండి సూర్యలంక రోడ్డులోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని ఉత్సవంగా తీసుకెళ్లి తిరిగి ఆలయానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి రథాన్ని లాగేందుకు ఆసక్తి చూపారు. భావదేవుని నామస్మరణతో భావపురి పులకరించింది. అనేక ప్రాంతాల్లో ఉంటున్న బాపట్ల వాసులు ఉత్సవాలకు ప్రత్యేకంగా విచ్చేసి, స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భావదేవ పాహిమాం.. రాజ్యలక్ష్మీ రక్షమాం, శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి బహుపరాక్, గోవిందా.. గోవిందా అంటూ భక్తుల నినాదాలతో రథంబజారు, సూర్యలంక రోడ్డు మారుమోగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఉంచి, పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పూజల్లో దేవదాయ మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఈ ఏడాది నూతనంగా నిర్మించిన రథంపై భావదేవుని ఉత్సవం నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్రదేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టర్ జె.వెంకటమురళి, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, ఆఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తదితరులు రథం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవంలో కొనసాగారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.

పటిష్ట బందోబస్తు

బాపట్ల తిరునాళ్ల సందర్భంగా భావదేవుని రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దేవాలయం నుండి సూర్యలంక రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు వాహనాలు అడ్డురాకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. కాలినడకన వేడుకల్లో పాల్గొనే ఏర్పాట్లు చేశారు. రథం లాగే సమయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేశారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ వెంకటమురళి ఎమ్మెల్యే కొండయ్యకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వేగేశన



డోలు వాయిద్యాలతో నృత్యం చేస్తున్న కళాకారులు



నూతన రథంపై కొలువు తీరిన భావదేవుడికి పూజలు



● రథోత్సవానికి హాజరైన భక్తులు

నీటి కుంటలో పడి బాలుడు మృతి

మార్టూరు,మే12(ఆంధ్రజ్యోతి): నీటికుంటలో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో కొండవ వద్ద ఉన్న నీటికుంటలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బాలుడు దుడ్డు కార్తీక్(8) తాతయ్య ప్రభుదాసుతో కలిసి గేదెలను మేపుకోవడానికి కొండ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ నీటి కుంటలో గేదెలు దిగాయి. వాటిని తోలడానికి నీటికుంటలో దిగిన బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించని తాతయ్య ప్రభుదాసు కార్తీక్ ఇంటికి వెళ్లాడని బావించాడు. కొంతసేపటి తర్వాత గేదెలను తోలుకొని ఇంటికి వచ్చారు. తర్వాత కార్తీక్ ఇంటికి రాలేదని గ్రహించిన ప్రభుదాసుతో పాటు కుటుంబ సభ్యులు, కొండ వద్దకు వెళ్లి నీటికుంట చూడగా, చనిపోయిన కార్తీక్ మృతదేహం కనిపించింది. కార్తీక్ తల్లితండ్రులు తిమోతి, సుస్మిత దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతి చెందిన కార్తీక్ పెద్దవాడు. రెండవ తరగతి పూర్తికావడంతో ఈ ఏడాది 3వ తరగతి చదవాలి. కుమారుడు మృతితో కార్తీక్ తల్లిదండ్రులు, బంధువులు కుప్పకూలిపోయారు. సోమవారం ఉదయం కార్తీక్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



కార్తీక్ (పాత చిత్రం)

ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మే12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. అద్దంకి పట్టణంలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవి కుమార్‌ను ఆయా ప్రాంతాలలో స్థానికులు వినతిపత్రాలు అందజేసి సమస్యలను వివరించారు. పలు సమస్యలపై తరచూ అర్జీలు వస్తున్నందున వెంటనే అర్జీదారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మురుగునీటి సమస్య, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సైడ్ డ్రైన్ ల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్య లను మంత్రి రవికుమార్ దృష్టి కి తీసుకు పోయారు. అద్దంకి పట్టణంలోని మొండితోకపాలెంలో వాగుపోరంబోకు భూమిని స్థానికులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేయడంతో మురుగునీరు, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని పెనుబాక ఆదాం మంత్రి రవికుమార్‌కు అర్జీ అందజేశారు. శ్రీనగర్ లో వర్ధిక ఆర్థో, స్కిన్ అండ్ ట్రామా కేర్ హాస్పటల్ ను మంత్రి రవికుమార్ ప్రారంభించారు.

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

వాసవినగర్‌లో టీడీపీ ఆర్యవైశ్య నాయకుడు, భాస్కర్ సప్లయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు మాతృమూర్తి మహాలక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా సోమవారం మంత్రి రవికుమార్ పరామర్శించారు. మహాలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బంగ్లా రోడ్డులో రవీంద్ర భారతీ ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ తోట చినమద్దులేటి ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు కరి పరమేష్, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి, కొమ్మాలపాటి సుధీర్, సందిరెడ్డి రమేష్, చిన్ని మురళీసుధాకర్, కరారి నాగేశ్వరరావు, మానం మురళీమోహన్‌దాస్, ఉన్నారు.

మేదరమెట్లలో : మండలంలోని కుర్రవానిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వజ్జా సీతారామయ్య కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. సోమవారం కుర్రవానిపాలెంలోని తెలుగుదేశం నాయకులు వజ్జా వాసు, సోదరుడైన సీతారామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకొని వారిని పరమార్శించారు. అనంతరం నాదేండ్ల వెంకటరత్నం ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు కోట శ్రీనివాసరావు, నాదెండ్ల లక్ష్మయ్య, కారసాల గురుబాబు తదితరులున్నారు.

సుబ్బారావుకు మంత్రి గొట్టిపాటి పరామర్శ



మానం సుబ్బారావును పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు : టీడీపీ సీనియర్ నాయకులు, రామకూరు గ్రామమాజీ సర్పంచ్ మానం సుబ్బారావును రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మానం సుబ్బారావును సోమవారం ఆయన నివాసంలో కలిసిన మంత్రి గొట్టిపాటి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడేవరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మంత్రి రవికుమార్ టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పార్టీ నాయకులు కేవీ. సుబ్బారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్, నార్నె సుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, మస్తాన్‌వలి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, గరిమిడి జగన్‌మోహన్, గుడిపాటి సుబ్బారెడ్డి, కాటా అంజయ్య, భానుప్రకాష్, హరిబాబు పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు జీవధ్వజ ఊరేగింపు

- శింగరకొండలో మహాకుంభాభిషేకానికి విశేషంగా ఏర్పాట్లు
- పలు ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలు

అద్దంకి, జూన్12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం అద్దంకి పట్టణంలో నగరోత్సవము నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెంలో ప్రారంభమై కాకానిపాలెం, పాతబస్టాండ్ సెంటర్, పాత గాంధీబొమ్మసెంటర్, భవానిసెంటర్ మీదుగా శింగరకొండకు జీవధ్వజస్తంభం ఊరేగింపు సాగనుంది. గతంలో జీవధ్వజస్తంభం ఇచ్చిన దాత మేదరమెట్ల శంకరారెడ్డి ప్రస్తుతం కూడా పునఃప్రతిష్ఠకు దాతగా ఉన్నారు. 35 అడుగుల ఎత్తు ఉన్న ధ్వజస్తంభం తయారీని మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, యేజెండ్ల ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

19న గుండ్లకమ్మ నది నుంచి కలశయాత్ర

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 19న మహాకుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో ఉదయం 5 గంటలకు అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మనది నుండి శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వరకు కలశయాత్ర నిర్వహించనుననట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. యాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.

రాతి మండపం నిర్మాణానికి విరాళాలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం నిర్మాణం కోసం సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన మాజీ పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, భారతి దంపతులు సందిరెడ్డి హనుమంతరావు, మల్లెంపూడి లక్ష్మయ్యల జ్ఞాపకార్థం రూ.1,00,116లను అందజేశారు. అద్దంకికి చెందిన నేరెళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం అలంకారలక్ష్మి, కుమారులు వెంకటశేషగిరి, శ్రీనివాసరావు, కుమార్తెలు చుండూరి వెంకటసుజాత, బాడకట్టు శశికళలు రూ.1,01,116 సోమవారం ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు. కాకానిపాలేనికి చెందిన అద్దంకి మున్సిపల్ వైస్‌చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి బాలవీరయ్య దంపతులు మారుతీ భవన్ లో గది అభివృద్ధికి అవసరమైన ఏసీ, డబుల్‌కాట్ మంచం, బెడ్, గీజర్ తదితర వస్తువుల కొనుగోలుకు అవసరమైన నగదు అందజేశారు. చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సాగర హారతి

వాడరేవు (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సామూహిక సాగర హారతి నిర్వహించారు. ఈక్రమంలో భక్తులు విశేషంగా పూజల్లో పాల్గొన్నారు. వైభవంగా కోదండరామస్వామి కల్యాణం

కోదండరాముని కల్యాణం

మార్టూరు : మండలంలోని రాజుపాలెం కోదండరామాలయంలో సోమవారం కోదండరామస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామస్థులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు స్వామి వారికి నూతన వస్త్రాలను అందజేశారు. కొబ్బరి కాయలు కొట్టి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా స్వామి వారి కల్యాణం అక్షితలను భక్తిపూర్వకంగా కళ్లకు అద్దుకొని, స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఇక సాయంత్రం గ్రామంలో కోదండరాముని ఉత్సవ విగ్రహాలను ఎడ్లబండిపై ప్రత్యేకంగా అలంకరించి యువకులు, భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు కూడా ఈ గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక తిరుకల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

నూతన రథోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

పేరాల (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని పేరాల్లో వేంచేసిన శ్రీగంగా భ్రమరాంబ సమేత పునుగు శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన రథోత్సవం సోమవారం రథంకమిటి ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ఈక్రమంలో వారికి కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామి వారి ఉత్సవం గతంలో 1971 లో జరిగింది. తిరిగి 54 సంవత్సరముల తరువాత నూతన పెద్ద రథం పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్మించి ఉత్సవం జరపడంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

చెరుకూరు (పర్చూరు): పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామివార్ల దేవాలయంలో వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌక ర్యం లేకుండా ఆలయ కార్య నిర్వాహక కార్యదిర్శి ఎం.నాగయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివార్ల కళ్యాణ వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

మంత్రికి సోపిరాల గ్రామపెద్దల సన్మానం

చినగంజాం, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామానికి వచ్చిన దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాణరెడ్డిని సోపిరాల గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. బాపట్ల, చీరాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొని నెల్లూరు తిరిగి వెళ్తు మార్గమధ్యంలో సోమవారం రాత్రి ఆయన సోపిరాల గ్రామాన్ని సందర్శించారు. సోపిరాల గ్రామానికి చెందిన విజయరావు మధుసూదనరావు మంత్రి రామనారాయణరెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మధుసూదనరావు ఇంటిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రిని గ్రామస్థులు సన్మానించారు.



శింగరకొండ లో ప్రతిష్ఠించనున్న జీవధ్వజస్తంభం



చీరాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారయణరెడ్డి









చీరాలలో సాగరహారతి, నేరెళ్ల వెంకట శేషగిరి,శ్రీనివాసరావులకు రసీదులు అందజేస్తున్న ఈఓ తిమ్మానాయుడు, పర్చూరులో స్వామివారి అలంకరణ, రాజుపాలెంలో కోదండరాముని కల్యాణోత్సవం

అతిథి అధ్యాపకులకు ప్రభుత్వం శుభవార్త

ఒంగోలు విద్య, మే 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులు(గెస్ట్ టీచర్లు)గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారికి ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాన్ని రెండు రెట్లు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అతిథి అధ్యాపకులకు ప్రస్తుతం గంటకు రూ. 150 చెల్లిస్తుండగా దానిని రూ. 375కు పెంచారు. అయితే ఈ పెంపుదల గరిష్ఠంగా రూ. 27వేలకు మించరాదు. ఈ ఉత్తర్వులపై తగు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్యా డైరెక్టర్‌ను పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఆదేశించారు. గౌరవ వేతనం పెంపు పట్ల అతిథి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు మే నెల జీతం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు 2024 మే నెల జీతం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు ఫైల్‌ఆర్థిక శాఖకు చేరింది. ఈ జీతం చెల్లింపునకు సంబంధించి ప్రతిపాదనలు పంపి సహకరించిన ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతి శుక్లాను జేఏసీ నాయకులు సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కార్యదర్శి చక్రమల్లి నాయక్, మహిళా ప్రతినిధులు రాజ్యలక్ష్మి, విజయకుమారి, సింధు తదితరులు ఉన్నారు.

మొక్కుబడి మరమ్మతులు

ఆర్‌అండ్‌బీ రోడ్డు అంచునే తవ్వి బరమ్‌లకు పోయటంతో కుంగే అవకాశం

మంత్రి రవికుమార్‌కు గోవాడ గ్రామస్థుల ఫిర్యాదు

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి రవికుమార్

అద్దంకి, మే 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శింగరకొండపాలెం-అంబడిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సుమారు 70 లక్షల రూపాయలతో చేస్తున్న మరమ్మతులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రోడ్డు మార్జిన్ వెడల్పుగా ఉండగా ప్రస్తుతం మరమ్మతుల పేరుతో బరమ్‌లకు మంచి గ్రావెల్ తోలాల్సిన కాంట్రాక్టర్ రోడ్డు అంచునే ఎక్స్‌కవేటర్‌తో తవ్వి పోస్తున్నారు. దీంతో మార్జిన్ పూర్తిగా తగ్గిపోగా ఇప్పటి వరకు పటిష్టంగా ఉన్న బరమ్ కాస్తా తవ్వటంతో పటిష్టత కోల్పోయింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుకు రెండు వైపులా తవ్వి పోసిన గ్రావెల్ మొత్తం జారిపోవటం ఖాయం అని గోవాడ గ్రామస్థులు ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. వెంటనే రవికుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణలో మాత్రమే రోడ్ల మరమ్మతులు చేయాలని, కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యానికి వదిలివేయరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

ఇక శింగరకొండపాలెం నుంచి బొమ్మనంపాడు మీదుగా ముప్పవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు కొన్ని చోట్ల తరచూ కుంగి ఇంకొన్నిచోట్ల ఉబ్బులు వస్తున్నాయి. ఇటీవల మరమ్మతుల సమయంలో కూడా ఆయా ప్రాంతాలలో లూజు మట్టి తొలగించి తారు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉన్నా అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేయటంతో మళ్లీ యథాస్థితికి చేరింది. వేగంగా వచ్చే వాహనాలు అసలే మలుపు కావటం అక్కడే రోడ్డు కుంగి ఉబ్బు రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కాంట్రాక్టర్‌లు ఇష్టానుసారం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా పర్యవేక్షణ లేకుండా చేస్తుండటంతో ఆశించిన ప్రయోజనం రాకపోగా ప్రమాదాలకు నిలయంగా మారాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు జరిగే సమయంలో ఖచ్చితంగా పర్యవేక్షణ చేయాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు అంచునే తవ్వి మార్జిన్‌లో పోసిన మట్టి



బొమ్మనంపాడు సమీపంలో కుంగిన రోడ్డు

అవీ..ఇవీ..

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, మే 12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా సోమవారం లక్ష తమలపాకుల పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకము, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి 11 ఆవృత్తములుగా వేద పండితులు, పూజారులు లక్ష తమలపాకుల పూజ చేశారు. ఉభయదాతలుగా గుంటూరు న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

కనులపండువగా రామకోటేశ్వరస్వామి కల్యాణం

చినగంజాం, మే 12(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో లలితా పరమేశ్వరి అమ్మవారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంతరావు స్వామి వారికి అభిషేకాలు చేశారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విశేషంగా అలంకరించిన స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి మేళతాళాలు, మహిళల కోలాటప్రదర్శనలతో సోపిరాల గ్రామంలోని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత వ౦ల్లాయ౦పాలె౦ గ్రామంలో సోమవారం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా దేవాలయంలో ఉన్న వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాల వద్ద యాత్రిక స్వామి వినుకోండ నరసింహాచార్యులు, ఆలయ అర్చకులు వినుకొండ విక్రమ్లు పర్యవేక్షణలో కళ్యాణాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పంగ వాతావరణం నెలకోంది. కళ్యాణం ఆనంతరం గ్రామస్థులు సమిష్టి కృషితో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

కమనీయంగా తిరునాళ్ల



తిరునాళ్ల సందర్భంగా తెలుగు యువత ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

ప్రధాన ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు

అలరించిన మహిళల కోలాట ప్రదర్శన, తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు

పంగులూరు, మే 12(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి వారి 21వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయంలో శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం (అద్దంకి) చెందిన మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. స్వామివారి తిరునాళ్ల సందర్భంగా ఉత్సవ కమిటీ, గ్రామ టీడీపీ, తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్థన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్షవర్ధన్‌కు ఈవో శ్రీనివాసరావు, పార్టీ నేతలు, తెలుగు యువత ఘనస్వాగతం పలికింది. ఆలయ ప్రాంగణం, పరిసరాలు విద్యుత్ దీపకాంతులతో శోభను సంతరించుకోగా, తిరునాళ్ల మహోత్సవం తిలకించేందుకు పంగులూరు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకుంది.. పూజా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు త్రివేణిబాబు, పార్టీ నాయకులు చౌదరి బాబు, శ్రీకాంత్, జగన్, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మంత్రి తనయుడు హర్షవర్ధన్

కనులపండువగా ఆంజనేయస్వామి కల్యాణం

పావులూరు తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

పావులూరు(ఇంకొల్లు),మే 12, (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న పొలిమేర వీరాంజనేయస్వామి 71వ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం ఎండతీవ్రతను సైతం లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం సువర్చల సమేత వీరాంజనేయస్వామి వారి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కనుల విందుగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చొని స్వామి కల్యాణం జరిపించారు. ఈ 71వ కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరునాళ్లను ఏర్పాటు చేయగా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారి వద్దకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. అన్నదాన సత్రాలలో అన్నదానం నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి వరకు భక్తుల రద్దీ తగ్గలేదు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకున్నారు.



అలంకరణలో ఆంజనేయస్వామి

అవీ..ఇవీ..

ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో కడవకుదురు డ్రైవర్ల సత్తా



కడవకుదురులో నిర్వహిస్తున్న ట్రాక్టర్ రివర్స్ పోటీలు

చినగంజాం, మే.12(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కడవకుదురు గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీలలో పాల్గొనేందుకు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన కొత్తపట్నం, ఒంగోలు, పర్చూరు, ఇంకొల్లు, చింతగుంపల్లె, పెదగంజాం తదితర ప్రాంతాలకు చెందిన 24 మంది డ్రైవర్లు వచ్చినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలలో కడవకుదురు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి(షేక్.షరీఫ్‌డ్రైవర్) నిర్ణీత ఒక నిమిషం వ్యవధిలో 252 అడుగుల దూరం నడిపి మొదటి బహుమతి రూ.5,116లను కైవసం చేసుకున్నాడు. కడవకుదురుకు చెందిన గాజుల జగదీష్ 178 అడుగుల దూరం నడిపి రెండ బహుమతి రూ.3,116లను, కడవకుదురుకు చెందిన కేశన బాజీ 152 అడుగుల దూరం నడిపి మూడవ బహుమతి రూ2,116లు అందుకున్నారు. న్యాయ నిర్ణేత, యాంకర్‌గా తంగెడ హసాన్ వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వ హణ కమిటీ సభ్యులు పేరాబత్తుల రామకృష్ణ, తోటకూర సుబ్బారావు, బత్తిన శ్రీనివాసరావు, గుద్దేటి వెంకటేశ్వర్లు, తోటకూర వీరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న న్యాయాధికారి

అద్దంకి, మే12 (ఆంధ్ర జ్యోతి): వేసవి తాపం నుంచి దాహార్తిని తీర్చేందుకు అద్దంకి పట్టణానికి చెందిన విశ్రాంత న్యాయాధికారి, కొత్త మాసు రంగ నాయకులు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మాసు మురళీకృష్ణ అచ్యుతరావు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయం పక్క రోడ్డులో తన ఇంటి ముందు ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో సుమారు 200 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గత 15 రోజులుగా పంపిణీ చేస్తున్నారు. ఎండల తీవ్రత తగ్గే వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రుచికరమైన మజ్జిగ పంపిణీ చేస్తుండటంతో అటు వైపు వెళ్లే ప్రతి ఒక్కరు తమ వాహనాలను ఆపి మజ్జిగ తాగి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.





ముందుకు కదలక ఇళ్ల వద్దే నిలిచిన మురుగు, పర్చూరు - చీరాల రోడ్డులో డ్రైనేజ్ కాలువపై నిర్మాణం





బొమ్మలకూడలిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు, కాలువలోనికి వెళ్లి మురుగుతొలగిస్తున్న కార్మికుడు

కొందరిపాపం మరికొందరికి శాపం

- డ్రైనేజ్ కాలువలపై వ్యాపార కట్టడాలు
- మురుగు ముందుకు కదలని వైనం

పర్చూరు, మే12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం పర్చూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా తయారైంది. ఉన్న కాలువలపై అక్రమనిర్మాణాలు చేపడుతుండడంతో కాలువల్లో మురుగుముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కాలువల్లో పడేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుతున్నాయి. దీంతో వర్షాల సమయంలో నీరు కాలువపై నుంచి బయటకు పొర్లుతున్నాయి. కొందరి ఆక్రమణల పాపం మరి కొందరి పరిశుద్యకార్మికులకు శాపంగా మారుతోంది.

నిత్యం పారిశుద్య కార్మికులు కాలువలను శుభ్రం చేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన నెలకొంది. దీనికి తోడు వ్యాపారులు తమ దుకాణాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా డ్రైనేజ్ కాలుల్లోకి పారవేయటంతో సమస్యత తీవ్రతరంగా మారింది. మురుగుతోపాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. పరూరు - చీరాల, పర్చూరు - ఇంకొల్లు, గుంటూరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన రహదారుల వెంబడి ఉన్న డ్రైనేజ్ కాలువల పరిస్థితి మరింత దయనీయం. ఈరోడ్లలో ఎక్కడ చూసిన డ్రైనేజ్ కాలువలపై భారీ కట్టడాలే దర్శనమిస్తున్నాయి అంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

పారిశుధ్య కార్మికులకు అవస్థలే

కొద్దిపాటి వర్షం కురిసినా పారిశుధ్య కార్మికులకు అవస్థలు అన్నవిధంగా పరిస్థితి తయారైంది. అక్రమణ దారులు ఏర్పాటు చేసుకున్న కట్టడాల క్రింద ఉన్న కాలువల్లోని వెళ్ళి మరీ పారిశుధ్య పనులను చేయాల్సి వస్తుంది అంటే సమస్య ఎంత తీవ్రతరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైనేజ్ కాలువలపై కట్టడాలను తొలగించి మురుగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏల్చూరుకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకిలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే12 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో పరిశ్రమలు, వ్యవసాయం, గృహవినియోగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏల్చూరు వద్ద రూ.23 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు, రైతుల వద్ద నుంచి 11.68 ఎకరాల భూమి కూడా సేకరించినట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలో సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వివరించారు. నియోజకవర్గానికి 4 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, ఇప్పటికే అద్దంకి పట్టణంలో రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన జరిగి పనులు ప్రారంభమయ్యాయన్నారు. సంతమాగులూరు మండలం కొప్పరం, బల్లికురవ మండలం మల్లాయపాలెంల వద్ద 33/11 కెవి సబ్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో 1300 పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మరో 600 కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. అద్దంకి పట్టణంలో కాలువ కట్టను మినీ బైపాస్ రోడ్డుగా మార్చేందుకు ఇప్పటికే రూ.15 కోట్లతో టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. మలివిడతలో కాకాని పాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ వరకు మినీ బైపాస్ రోడ్డు పొడిగించనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు అదనపు సిబ్బందిని కేటాయించాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తో ఫోన్‌లో మంత్రి రవికుమార్ మాట్లాడారు. అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఓపెన్ జిమ్ స్థానంలో ఇండోర్ జిమ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర ను ఆదేశించారు. విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, డీఈ దామోదరం, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు

పరిశ్రమలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక లైన్‌ను ప్రారంభించిన ఈఈ మస్తాన్‌రావు



లైను ప్రారంభిస్తున్న ఈఈ

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పేర్కొన్నారు. బల్లికురవ సబ్‌స్టేషన్ నుంచి వీర్ల గంగమ్మ వైపు ఉన్న గ్రానైట్ పరిశ్రమలకు కొంతకాలంగా లోవోల్టేజ్ విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. దీంతో పరిశ్రమల యజమానులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకు పోయారు. మంత్రి ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ నుంచి గంగమ్మ దేవాలయం వరకు రూ.30 లక్షల ఖర్చు చేసి ప్రత్యేక విద్యుత్‌లైనును ఏర్పాటు చేశారు. ఈ లైన్‌ను సోమవారం ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అద్దంకి నియెజక వర్గంలో ఆర్‌టీఎస్ఎస్ ద్వారా నూతన స్తంభాలను లైన్లను ఏర్పాటు చేయిస్తున్నామ న్నారు. ప్రజలకు, మరియు పరిశ్రమల వారికి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను అందిస్తామన్నారు. ప్రభుత్వం వచ్చిన 10 నెలల సమయంలో పెద్ద ఎత్తున విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఈసందర్బంగా నూతన లైన్ ఏర్పాటు చేసి ప్రారంభించడంతో గ్రానైట్ పరిశ్రమల యజమానులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టురు ఏడీఈఈ సురేంద్ర బాబు, ఏఈ శ్రీనివాసరావు, లైన్‌మేన్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

అవగాహన సదస్సులో ఏడీఏ మోహనరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ

ఇంకొల్లు, మే 12, (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు పండించినట్లయితే లాభాలు పొందవచ్చునని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. మండలంలోని ఇడుపులపాడులో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మగ్గు చూపాలన్నారు. ఈ పద్ధతిలో పండించిన ఆహారం తినడం వలన ఆరోగ్యంతో పాటు లాభాలు పొందవచ్చునన్నారు. భావితరాలకు మంచి వ్యవసాయభూమిని అందజేయాలన్నారు. రసాయన ఎరువులతో వచ్చే అనర్థాలను వివరించారు. మహిళలు పెరటి తోటలు ప్రకృతి వ్యవసాయ విధానంతో చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంద న్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కె టింగ్ ధ్రువీకరణపత్రం అందజేస్తారని ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేపట్టిన సుబ్బారావు, జక్రయ్య, సులోచన, శ్రీకాంత్, రాంబాబు, అంజయ్య, శ్రీనివాసరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్,సర్పంచ్ బండారు సుమతి, రైతులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సాధించిన విజయం



మాదిగల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

వాడరేవు (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మాదిగ సామాజిక వర్గంతో పాటు ఎంతోమంది ప్రముఖులు, అవగాహనపరులు పూర్తిస్థాయిలో మంద కృష్ణమాదిగకు మద్దతు తెలిపారని ఇది సమైఖ్య విజయమని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఎంఆర్‌పిస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వాడరేవులో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుకు వీర మరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నరసయ్య మాదిగ, వందనం, రమేష్, తేళ్ల రమేష్, నాగేశ్వరరావు, రవి, అంకయ్య విజయ్‌సుందర్, వీర శేఖర్, అభిషేక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈగా శ్రీనివాసరావు బాధ్యతలు



పుష్పగుచ్చం అందజేస్తున్న ఏఈ

పర్చూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు సబ్‌విజన్ విద్యుత్ కార్యాలయ డీఈఈగా జె.శ్రీనివా సులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేటపాలెం డీఈఈగా విధులు నిర్వహిస్తూ పర్చూరు వచ్చారు. ఇప్పటి వరకు పర్చూరు కార్యాలయంలో విధులు నిర్వహి స్తున్న రమేష్ గుంటూరు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఈని స్థానిక ఏఈ రమేష్ నాయక్ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి నిధుల మంజురుకు వినతి

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలో జీర్ణావస్థలో ఉన్న రామాలయం పునర్మిణానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజురు చేయించాలని బల్లికురవ గ్రామ ప్రజలు సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అయన సవ్నహంలో కలిసి విన్నవించారు. ఈసందర్బంగా వారు దేవదాయ శాఖ పరిధిలో రామాలయం ఉందని నిధులు మంజురు చేయిస్తే నూతన దేవాలయం నిర్మాణం చేపడతామని తెలపగా మంత్రి గ్రామ ప్రజలు మ్యాచింగ్ నిధులు రూ. 40 లక్షల పైబడి చెల్లిస్తే కొంత దేవాదాయ శాఖ ద్వారా మంజురు చేయిస్తామని వారికి హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యోగాతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత



బహుమతులతో విద్యార్థులు

చినగంజాం, మే 12 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులు యోగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొం దుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగాశిక్షకులు వై.రామాంజనేయులు అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ అధికారి శ్రీరామచంద్రమూర్తి వేదిక్ టేబుల్స్‌లో 20 లోపు మల్టీపిక్ లేషన్ చేసి షార్ట్‌కట్ అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం బోధించిన అంశాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అంద జేశారు. కంపూటర్ల వర్డ్ ప్యాడ్ ఎలా ఉపయోగించాలి, పలు అంశాలపై విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఆర్.పోతు రాజు, పి.శ్రీనివాసరావు, గ్రంథపాలకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తా

- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



ఆర్‌వో ప్లాంటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

గవినివారిపాలెం (చీరాల), మే 12 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గవినివారి పాలెంలో నాంది స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నట్లు గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. ఈనేపద్యంలో ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని పలుమార్లుచర్చలు జరిపి ఆర్వో ప్లాంటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈక్రమంలో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ఎఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నక్కల వెంకటేశ్వర్లు తదితర టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా దంపతులకు గాయాలు

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై గుంటూరు వైపు మండల పరిదిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద కందుకూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు దేవా,సుస్మితలకు గాయాలయ్యాయి. వారిద్దరిని హైవే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గాయపడిన భార్యా భర్తలు కందుకూరుకు చెందినవారు. వారు వ్యక్తిగత పనులు నిమిత్తం చిలకలూరిపేట వెళుతుండగా ప్రమాదం జరిగింది.

గృహనిర్మాణాలను పూర్తిచేయండి



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఈ ఖాదర్‌వలి

మార్టూరు, మే12 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై డబ్బులు చాలక ఇళ్లనిర్మాణాలను పూర్తి చేసుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి అన్నారు. ఆయన సోమవారం మార్టూరులో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్లనిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోలేని వారికి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు మంజూరుచేసిందన్నారు. దీంతో అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలను పూర్తిచేసుకోవాలన్నారు. అనంతరం ఆయన మార్టూరు హౌసింగ్ కార్యాలయంలో మండలంలో వివిధ స్టేజీలలో పెండింగ్ లో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి నిర్మాణాలను పూర్తిచేసేవిధంగా లబ్దిదారులకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం మార్టూరు హౌసింగ్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌ను అభినందించారు. పక్కా ఇళ్లు మంజూరైన లబ్దిదారులకు సక్రమంగా సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ అవ్వారు హరిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు గాయాలు



గాయపడ్డ కాలేషావలి

బల్లికురవ. మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు షేక్ కాలేషావలి సోమవారం మూడు చక్రాల బైకు అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అందిన సమాచారం మేరకు మార్టూరు నుండి మూడు చక్రాల బైకుపై వస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ కాలేషావలి గోతుల వద్దకు వచ్చే సరికి బైకు పడి పోయింది. వెంటనే బల్లికురవ 108 సిబ్బంది గాయాల పాలయిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను మార్టురు వైద్యశాలకు తరలించారు.

ఆంధ్రజ్యోతి
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 13 మే 2025

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప వెలుగుల మధ్య తరలివచ్చిన భక్తజనంతో కిక్కిరిసిపోయిన పెంచల లక్ష్మీనృసింహుడి సన్నిధి



పెంచలకోనలో..

వేదగిరిలో..



కోనలో గజవాహనంపై లక్ష్మీనృసింహుడు

పెంచలోరి కల్యాణం..
ముఖిసిన భక్తజనం!

- కిక్కిరిసిన పెంచలకోన, వేదగిరి క్షేత్రాలు
- కోనలో రథంపై విహరించిన వధూవరులు
- గజవాహనంపై శ్రీవారి వైభోగం

ఆకాశమే పందిరిగా.. ఓ వైపు వేద పండితుల మంత్రోచ్ఛరణ, మరోవైపు మంగళ వాయిద్యాల నడుమ.. తరలివచ్చిన భక్తులే అతిథులుగా పెంచలకోన, వేదగిరి క్షేత్రాల్లో సోమవారం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహ స్వామివారి కల్యాణం వేడుకగా జరిగింది. తొలుత ఉదయం కోనలో శ్రీవారి కల్యాణం జరగ్గా, భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం రథోత్సవం, రాత్రి గజవాహనంపై స్వామి వారు విహరించారు. ఇక నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి క్షేత్రంలో సాయంత్రం ఉభయదేవేరులతో కలిసి స్వామివారి కల్యాణం జరిగింది. అనంతరం గజ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

- వివరాలు 8లో..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు (విద్య), మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 65 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్నాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరగ్గా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,129 మంది హాజరవగా 278 మంది గైర్హాజరయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో 572 మంది హాజరవగా 43 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐఓ టి.వరప్రసాద్‌రావు 13 సెంటర్లు, డీవీఈఓ 4, డీఈసీ సభ్యులు 8, ఫ్లైయింగ్ స్క్వాడ్ 27 సెంటర్లను పరిశీలించారు.

● 19 నుంచి టెన్త్‌కు..

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి లేదా మనమిత్ర వాట్సప్ నుంచి వివరాలు నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

నెల్లూరు(విద్య) : అర్హత కలిగిన అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృతికాశుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ ఎం.రమణారెడ్డిని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఏసీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ జయమాలతి జగదీషంను టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ బి.కృష్ణవేణిని రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ జి.కరుణకుమారిని వెంగమాంబాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ పి.సద్గుణరావును కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే పీవీపాళెం కళాశాల హిందీ లెక్చరర్ కె.లక్ష్మీగణేశ్వరిని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, సత్తెనపల్లి కళాశాల సివిక్స్ లెక్చరర్ వి.శ్రీనివాసరావును ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు పదేళ్ల తరువాత పదోన్నతుల ప్రక్రియ జరగడంతో అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

'ట్రేడింగ్' పేరుతో రూ.లక్షలు దోచేశారు

నెల్లూరు (క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి వద్ద రూ.21.6 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేశారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని ఎన్జీవో కాలనీకి చెందిన మురళికి గతేడాది డిసెంబరులో ఫేక్‌బుక్‌లో వచ్చిన ఓ లింక్ ఆధారంగా ఓ ట్రేడింగ్ కంపెనీకి చెందిన యాప్‌లో చేరాడు. ఆ కంపెనీకి చెందిన ప్రతినిధులు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే నాలుగు నెలల్లో రెట్టింపు లాభాలు పొందుతారని నమ్మించారు. దీంతో మురళి డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు ఆరు విడతల్లో రూ.21.6 లక్షల నగదు డిపాజిట్ చేశారు. అనంతరం ఆయన తన ఖాతాలోని రూ.10 లక్షల నగదును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. బ్రోకరేజ్ ఫీజు రూ.7.99 లక్షలు పంపితే డబ్బు డ్రా చేసుకోవచ్చని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు వేదాయపాలెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాపాల్లో పాలుపంచుకున్నాం..
ఇప్పుడు అనుభవిస్తున్నాం!

ఫైలాన్‌ను ధ్వంసం చేసింది మాజీ ఎమ్మెల్యే ప్రతాపే!
ఆయన ఓ మేకవన్నె పులి!
ఏఎంసీ మాజీ చైర్మన్ సుకుమార్ సంచలన వ్యాఖ్యలు



కావలిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం వల్ల అన్ని అరాచక కార్యక్రమాల్లో పాలుపంచుకోక తప్పలేదు. అప్పటి పాపాల్లో పాలుపంచుకున్నాం కాబట్టే అనుభవిస్తున్నాం.' అని కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమేల సుకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కావలిలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫైలాన్‌ను ధ్వంసం చేసింది ప్రతాప్‌కుమార్ రెడ్డేనంటూ ఆరోపణలు గుప్పించారు. కావలి వాసుల దాహార్తి తీర్చేందుకు అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ఎం. వెంకయ్య నాయుడుతో బీద సోదరులు మాట్లాడి రూ.100 కోట్లతో అమృత్ మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఈ పథకానికి సంబంధించిన ఫైలాన్‌ను అప్పటి మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారని చెప్పారు. అయితే, ఫైలాన్‌పై తన పేరు లేదని అక్కసుతో ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వంసం చేయించారని ఆరోపించారు. ఆరోజు తాను వ్యతిరేకించానని చెప్పారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో అక్కడికెళ్లానని అప్పటికే ఫైలాన్ ధ్వంసం జరిగిపోయిందని, ప్రతాప్‌కుమార్ రెడ్డి అక్కడే ఉన్నారని తెలిపారు. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా బెయిల్ తెచ్చుకొని సంబంధం లేని రిమాండ్‌లో ఉన్న నలుగురు విలేకర్లను గాలికి వదిలేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వాడుకుని వదిలేయడం ఆయన నైజమని, పైకి అమాయకంగా కనిపించే మేకవన్నె పులి ప్రతాప్ అంటూ మాట్లాడారు. తాడేపల్లి, బెంగళూరు ప్యాలెస్‌ల బినామీ ప్రతాప్‌కుమార్ రెడ్డి అని, బెంగళూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో వాకబు చేస్తే ఆయన అవినీతి చిట్టా బయటపడుతుందని దుయ్యబట్టారు. జైలులో ఉన్న విలేకర్లను ప్రతాప్ పట్టించుకోవపోతే బెయిల్ ఇప్పించేందుకు తాను సహకరిస్తానని అన్నారు.


సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్లు

సోమశిల డ్యాం అభివృద్ధికి కార్యాచరణ

రూ.2 కోట్లతో లీకేజీలు, రోప్‌ల పటిష్టత
సీఎం ఆదేశాలతో పనుల్లో కదలిక

అనంతసాగరం, మే 12 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయ పరిధిలోని కీలక పనుల్లో కదలిక వచ్చింది. జలవనరుల శాఖ నిపుణుడు, విశ్రాంత ఇంజనీరు కన్నయ్యనాయుడు ఇటీవల సోమశిల డ్యాంను సందర్శించారు. ఇక్కడి లోపాలను నివేదిక రూపంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించడంతో అభివృద్ధి పనులకు ఊతం కలిగింది. దెబ్బతిన్న షెట్టర్లు, రోప్ పనులు చేసేందుకు అండర్‌వాటర్ వర్కర్స్ టీం ఇటీవల డ్యాంకు చేరుకుని కొంతమేర పనులు చేసింది. ఇక లీకేజీలు, రోప్‌లను పటిష్ఠ పరచడంతోపాటు దెబ్బతిన్న షెట్టర్లను తొలగించి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.2 కోట్లతో టెండర్ల ప్రక్రియ మొదలెట్టగా విశాఖకు చెందిన స్వర్ణ సంస్థ పనులు దక్కించుకుంది. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేబినెట్ సమావేశంలో సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

● వర్షాలకు ముందు పనుల పూర్తి

ఈ నెలాఖరుకు నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకుతాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆగస్టు మొదటి వారం నుంచి కృష్ణా జలాలు సోమశిలకు చేరే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత తుఫాన్ల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఈలోపు పనులకు ముగింపు పలికితే బాగుంటుందని విశ్రాంత ఇంజనీరింగ్ నిపుణులు సూచిస్తున్నారు. కాగా, డ్యాంలో సోమవారం నాటికి 49.422 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దక్షిణ కాలువకు 50, ఉత్తర కాలువకు 100, పెన్నాడెల్టాకు 5,030 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎస్ఎస్ఏలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : సమగ్రశిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి పోస్టులకు డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకట నలో తెలిపారు. అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్, ఏఎస్ఓ, ఏఐఈసీఓ, ఉర్దూ ఏఏంఓ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో మంగళ, బుధవారాల్లో ఎస్ఎస్ ఏ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చందు, నందు ఇద్దరూ అన్నదమ్ములు. వేసవి సెలవులకు సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మ ఇంటికి వచ్చారు. పెద్దమ్మ కుమారుడితో కలిసి కనిగిరి ప్రధాన కాలువలో ఈతకు వెళ్లారు. నాలుగు రోజులుగా ఇలాగే వెళ్తున్నారు. కాలువలో తక్కువగా నీళ్లు ప్రవహిస్తుండటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే, సోమవారం కాలువకు సుమారు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇంకేముంది.. ఈ నీటిఉధృతికి ముక్కుపచ్చలారని ఆ ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే..

- కనిగిరి ప్రధాన కాలువలో అన్నదమ్ముల గల్లంతు
- వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి విషాదం
- ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు
- ఫలించని గజ ఈతగాళ్ల అన్వేషణ




కాలువలో గల్లంతైన చందు, నందు (ఫైల్)

సంగం/కోవూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కోవూరులోని స్టౌబీడి కాలనీకి చెందిన బందా గోవిందయ్య, శేషమ్మకు చందు (14), నందు (11) కుమారులు. గోవిందయ్య తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో పది రోజుల క్రితం ఇద్దరూ సంగంలోని అమ్మమ్మ, పెద్దమ్మ ఇంటికి వచ్చారు. 4 రోజుల నుంచి వీరిద్దరు పెద్దమ్మ కుమారుడితో కలిసి సరదాగా కనిగిరి ప్రధాన కాలువలో ఈతకు వెళ్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఈతకు వెళ్లారు. కాలువలో 350 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సోమవారం నీటి విడుదలను 1500 క్యూసెక్కులకు పెంచడంతో ఉధృతి పెరిగింది. పెద్దమ్మ కుమారుడు మాత్రం గట్టు మీద కూర్చొని మొబైల్ చూసుకుంటున్నాడు. సరిగా ఈతరాని చందు, నందు నీటిలో దిగగానే ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఇది గమనించిన పెద్దమ్మ కుమారుడు కేకలు వేశాడు. సమీపంలో ఉన్న పశువుల కాపర్లు అక్కడికి వచ్చి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈతగాళ్లను పిలిపించి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కాలువలకు నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇంతలో చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. సమాచారం అందుకున్న కోవూరులోని తల్లి శేషమ్మ సంగం వచ్చి గుండెలవిసేలా రోదిస్తున్నారు. చందు, నందులు కాలువలు గల్లంతైన విషయం తెలియగానే కోవూరులోని స్టౌబీడీ కాలనీలో విషాద చాయలు అలుముకున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 500



గురుకులంలో చెదలు నివారణకు చర్యలు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆదేశాల మేరకు సోమవారం మలాథియాన్ స్ప్రే చేశారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతు తరగతి గదులు, గోడలకు ఫంగస్, బ్యాక్టీరియా (చెదలు) చేరకుండా ఉండేందుకు స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు



గాలికి పడిపోయిన విద్యుత్ స్తంభం

కొండాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు బలమైన ఈదురుగాలులతో చిరు జల్లులు కురిశాయి. ఈదురుగాలుల ధాటికి కొమ్మి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గానుగపెంట, పెరికపాలెం గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతోపాటు దాదాపు ఐదు స్తంభాలు కూలిపోయాయి. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈదురుగాలులకు గతంలోనూ విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌కి సన్మానం

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో బంధువుల ఇంటికి విచ్చేసిన ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును ఆదివారం రాత్రి దళిత నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గుడ్లూరులో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అక్కడి నుంచి తన బంధువైన టీడీపీ నేత పర్రి గోపీకృష్ణ, కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న దళిత నేతలు జైభీం రవిచంద్ర, జ్యోతి నాగరాజు, గాలి రమేష్‌లు ఆయను మర్యాదపూర్వకంగా కలిసి కేక్‌కట్ చేసి సన్మానించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు : ఎంవీఐ

కందుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మైనర్లతో ఇసుక, మట్టి ట్రాక్టర్లు, ఆటోలు నడిపిస్తున్నారని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలకు కేసులు నమోదు చేస్తామని కందుకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు హెచ్చరించారు. సోమవారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో, కారు డ్రైవర్లుకు డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల నసరిష్కార వేదిక కార్యక్రమంలో భూ సమస్యలపై రెండు అర్జీలు అందినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు లబ్ధిదారుల నుంచిదరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 55 ఏళ్ల వయస్సు గల వారు రాయితీ రుణాల కోసం మీసేవ, గ్రామ సచివాలయాలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతలతో కూడిన దరఖాస్తును ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

హరిప్రసాద్‌కు జనసేన నేత అభినందన

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన నాయకుడు పసుపులేటి హరిప్రసాద్‌కు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తిరుపతిలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా శ్రీనివాసులు

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి తహసీల్దారుగా (ఎఫ్ఏసీ) డీటీ కె శ్రీనివాసులును కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ నియమించారు. ఈ మేరకు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ తహసీల్దారుగా పని చేస్తున్న ఎస్ సీతామహాలక్ష్మి అనారోగ్య కారణాలతో ఈనెల 7 నుంచి 23వ తేదీ వరకు సెలవు పెట్టడంతో శ్రీనివాసులును ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

కొత్త పనులా..

● అభివృద్ధి పనుల బిల్లులకు బ్రేక్! ● వడ్డీలు కట్టలేకున్నామని నేతల ఆవేదన
● చెల్లించే వరకు ప్రారంభానికి ససేమిరా..

మాకొద్దు బాబోయ్..!

వలేటివారిపాలెం, మే 12(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థపడుతుంటే మళ్లీ కొత్త పనులా.. మాకొద్దు బాబోయ్ అంటూ నేతలు ఆందోళన చెందుతున్నారు. వివరాల మేరకు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి విడతలో ఉపాధి హామీ పథకం కింద వలేటివారిపాలెం మండలానికి 25 పనులకు రూ.3 కోట్ల మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదట్లో పనులు చేసిన అయ్యవారిపల్లె, నలదలపూరు, కళవళ్ల గ్రామాల్లో పనులు చేసిన వెంటే బిల్లులు చెల్లించారు. దీంతో ఏ పని చేసినా తక్షణం బిల్లులు వస్తాయని భావించిన కొందరు నేతలు ప్రజాప్రతినిధులతో గొడవలు పడి పనులు దక్కించుకొని ఆగమేఘాలపై అప్పులు చేసి అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు పూర్తి చేశారు. అన్ని నామినేటెడ్ పనులు కావడంతో పోటీపడి చేశారు. అయితే పనులు చేసి ఏడెనిమిది నెలలు అవుతున్నా బిల్లులకు అతీగతి లేదు. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేసిన వాళ్లు బిల్లులు అందక దిక్కులు చూస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ద్వితీయశ్రేణి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మరికొన్ని పనులు చేసేందుకు నేతుల ఎవరూ ముందుకు రావడంలేదు. బిల్లులు చెల్లించకుండా పూర్తయిన పనులు ప్రారంభించేందుకు ఆ నేతలు ససేమిరా అంటున్నారు.



బడేవారిపాలెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

అప్పుడూ ఇప్పుడూ అలాగే ...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పనులు చేశారు. ఆ తరువాత అధికారం కోల్పోవడంతో వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను నిలిపివేసింది. దీంతో చాలా మంది అప్పులపాలై కొంతమంది ఆత్మహత్యల వరకు వెళ్లారు. మరికొంత మంది కోర్టును ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత బిల్లులు చెల్లిస్తారని నాయకులు ఆశించారు. అయితే ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. ఈసారైనా పోయిన సొమ్ము సంపాదించుకుందామని పనులు చేపడితే చేసిన పనులకు బిల్లులు రాకపోవంతో అధికార పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోని పరిస్థితి ఇప్పుడు కూడా ఎదురుకావడంతో కొంతమంది పని చేసిన నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. పనులు చేసి అప్పులపాలై వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడూ ఇప్పుడూ ఇలాగే అయితే తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతనిధులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరయ్యేలా చూడాలని టీడీపీ నేతలు కోరుతున్నారు.

అదిగో.. ఇదిగో అంటున్నారు

సిమెంటు రోడ్ల పనులు చేసిన నేతలు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంది వాస్తవమే. ప్రతి రోజూ బిల్లులు అడుగుతున్నారు. బిల్లులు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు కూడా అదిగో ఇదిగో అంటున్నారు.

- శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ, వలేటివారిపాలెం

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

● త్రివిక్రమ్‌రావు, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, లింగసముద్రం



లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి చెరువుల అభివృదిలో భాగంగా 7 చిన్నతరహా, 8 పంచాయతీరాజ్ చెరువుల పనులకు ప్రతిపాదనలు పంపగా 5 చిన్నతరహా, 1 పంచాయతీరాజ్ చెరువుకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని మైనర్ ఇరిగేషన్ ఏఈఈ టీ.త్రివిక్రమ్‌రావు తెలిపారు.

? చిన్నతరహా సాగునీటి చెరువుల అభివృద్ధి పనులు ఎప్పుడు చేపడుతారు.

! మండలంలో 15 చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపగా ఆరు చెరువులకు నిధులు మంజూరయ్యాయి. పరిపాలన అనుమతులు రాగానే పనులు మొదలు పెడుతాం.

? ఏఏ చెరువులకు నిధులు మంజూరయ్యాయి. ఏఏ పనులు చేపడుతారు.

! పెదపవని, చినపవని, వీఆర్ కోట, లింగసముద్రం కొత్త, పాత చిన్నతరహా చెరువులకు, ఎర్రారెడ్డిపాలెం పంచాయతీరాజ్ చెరువుకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువుల కట్టలు, చెరువులకు నీరొచ్చే వాగులు, ఒరవలు, తూములు, కాలువల మరమ్మతు పనులు చేపడుతాం.

? మండలంలోని చెరువుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! చెరువుల ఆక్రమణలను గుర్తించేందుకు రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. వారు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించిన అనంతరం ఆక్రమణలను తొలగించి ట్రెంచ్ ఏర్పాటు చేస్తాం.

? చెరువుల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలపై తమకు ఫిర్యాదులు వస్తే పరిశీలించి వాహనాలను సీజ్ చేసి పోలీసు కేసులు నమోదు చేయిస్తాం. గ్రావెల్ అక్రమంగా తరలించే సమాచారం తనకు ఫోన్ ద్వారా తెలపాలి.

కళ్లను కాటికి పంపొద్దు!

● రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవదానంపై అవగాహన

కావలి, మే 12(ఆంధ్రజ్యోతి): మనిషి మృతి చెందాక కళ్లను కాటికి పంపకుండా దానం చేస్తే ఎంతో మంది అంధులకు చూపు ఇచ్చిన వారవుతారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. మనదేశంలోని అంధులలో 20 శాతం మంది కార్నియా లోపం కలిగిన వారే ఉన్నారని, వారికి చనిపోయిన వ్యక్తుల కార్నియా సేకరించి చూపు కల్పించవచ్చని పేర్కొన్నారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యురాలు, అభయం సేవా సంస్థ నిర్వహకురాలు ఇలింద్ర శ్రీవాణి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి భజన మందిరంలో సోమవారం నేత్ర, అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 70 మంది కార్నియా అంధులకు ఒక్కరు మాత్రమే నేత్రదానం చేస్తున్నారని, 140 కోట్ల మందిలో ఒక శాతం నేత్రదానం చేసినా కార్నియా అంధులు ఉండరని తెలిపారు. బ్రెయిన్‌డెడ్ అయినపుడు అవయవ దానం చేయవచ్చన్నారు. అనంతరం చనిపోయిన తర్వాత నేత్రదానం చేసిన 15 మంది కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కొత్తూరు సత్యం, అభయం సేవాసంస్థ నిర్వాహకులు ఇలింద్ర వెంకటేశ్వర్లు(ఈవీఎస్), నూనె రామమోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ అధ్యక్షురాలు ఎస్.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 12(ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సమీక్ష సమావేశం ఒంగోలులోని ప్రకాశం భవన్ పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, సహచర శాసన సభ్యులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా జరిగిన సమీక్షలో కందుకూరు నియోజకవర్గంలోని మండలాల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు

బిట్రగుంట, మే 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రావుస్వామిపాలెంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం ప్రహరీ నిర్మాణం, మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన ఆ హాస్టల్‌ను సందర్శించారు. స్థానిక సమస్యలను వార్డన్ ఎం.అనిత ఆయనకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం, గదులు, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.14 లక్షల మంజూరైనట్లు తెలిపారు. హాస్టల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర ఆయనను కోరారు.



ప్రహరీ నిర్మించాల్సిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య

తహసీల్దారు కార్యాలయంలో పని చేయని ఇంటర్నెట్

లింగసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం తహసీల్దారు కార్యాలయంలో గత 10 రోజుల నుంచి ఇంటర్నెట్ పనిచేయకపోవడం లేదు. దీంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులు హాజరు కాలేకున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాసులును వివరణ కోరగా తమకు ఏపీ ఫైబర్‌నెట్ కనెక్షన్ ఉందని, అది 10 రోజులుగా కనెక్ట్ కావడం లేదని చెప్పారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

పంట కాలువ నిర్మాణ పనులు చేపట్టండి : సీపీఎం

కావలిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని పంట కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని సీపీఎం నేతలు కోరారు. సోమవారం సీపీఎం నేతలు పంట కాలువను సందర్శించి కాలువ దుస్థితిపై మున్సిపల్ ఆర్‌వో ఫణికుమార్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీ.పెంచలయ్య మాట్లాడుతూ కావలి చెరువు నుంచి పాతూరు మీదుగా వెళ్లే పంట కాలువ పూడికతో నిండిపోయి నీరు ముందుకు ప్రవహించక దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిందని, పందులు సైరవిహారం చేస్తున్నాయన్నారు. దీంతో కాలువకు ఇరువైపులా నివాసం ఉండే ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. కాలువకు రక్షణ గోడలు లేవని, కాలువ పక్కన రోడ్లు ధ్వంసం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పంట కాలువ పూడిక తీసి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, మధు, కమలాకర్ పాల్గొన్నారు.



మున్సిపల్ ఆర్‌వో ఫణికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ప్రమాదాలకు నిలయంగా క్రాస్ రోడ్డు!

● చౌదరిపాలెం, బుడంగుంట గ్రామాలకు రాంగ్ రూట్‌లో వెళ్లాల్సిందే

కావలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి కావలి మండలం చౌదరిపాలెం గ్రామానికి వెళ్లే క్రాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి నుంచి చౌదరిపాలెం, బుడంగుంట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముసునూరులోని మాగుంట పార్వతమ్మ ట్రంక్‌రోడ్డు నుంచి చౌదరిపాలెం క్రాస్ రోడ్డుకు వాహనాలు వెళ్లాలంటే జాతీయ రహదారిపై 500 అడుగుల మేరకు రాంగ్ రూట్‌లో వెళ్లక తప్పడం లేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు సంబంధం లేకుండా దానికి ఆనుకుని జాతీయ రహదారి పక్కన ఉన్న రోడ్డును చౌదరిపాలెం క్రాస్ రోడ్డు వరకు పొడగించాలని వాహనదారులతోపాటు చౌదరిపాలెం, బుడంగుంట వాసులు కోరుతున్నారు.



జాతీయ రహదారికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న చౌదరిపాలెం క్రాస్‌రోడ్డు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

వలేటివారిపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి అడవుల్లో సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 'స్థావరాలు మారుస్తూ జోరుగా పేకాట' అని ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక పోలీసులు స్పందించారు. చుండిలో పేకాట శిబిరంపై ఎస్‌హెచ్‌వో బ్రహ్మయ్య తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుమంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5400, మూడు మోటారుబైకులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పేకాటరాయుళ్లను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన ఎస్‌హెచ్‌వో తెలిపారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూములు పరిశీలించిన ఆర్డీవో

అల్లూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తుమోపూరు, గ్రద్దగుంట గ్రామాల్లో చేపట్టిన రీసర్వేలో చెరువులుగా నమోదైన భూములను కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ సోమవారం సాయంత్రం పరిశీలించారు. నార్తుమోపూరులో 174 ఎకరాల భూమిలో కేవలం 4 ఎకరాలు మాత్రమే చెరువు కింద నమోదై ఉండగా రీసర్వే చేపట్టిన సమయంలో 174 ఎకరాల భూమిని చెరువు కింద నమోదు చేశారు. దీంతో గత శుక్రవారం అల్లూరులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో రైతులు ఇచ్చిన అర్జీలపై ఆయన స్పందించి పరిశీలించారు. అదేవిధంగా గ్రద్దగుంటలో ఇటువంటి సమస్య ఉండడంతో సదరు భూములను కూడా ఆయన పరిశీలించారు. ఈ భూముల వివరాలను ప్రత్యేక నివేదికలను తయారుచేసి ఇవ్వాలని తహసీల్దారు లక్ష్మీనారాయణను ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



భూముల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

రోగులకు పండ్లు పంపిణీ

కావలిటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి) : నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సోమవారం బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి పాల్గొని నర్సులచే రోగులకు పండ్లు పంపిణీ చేయించారు. ఆమె మాట్లాడుతూ నర్సింగ్ డేని పురస్కరించుకుని వారి సేవలను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రియాంక, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, తదితరులు

వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో అగ్ని ప్రమాదం

కందుకూరు, మే 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. కార్యాలయం ముందు తాటాకుల పందిరి వేసి ఉంది. అకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో కార్యాలయంలో పనిచేసే వ్యక్తులు చూసి పందిర కింద పార్క్ చేసిన కార్లు, విలువైన వస్తువులు బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలు అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నట్లు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ఓలీవ్‌రెడ్లీ తాబేళ్లను సముద్రంలో వదులుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

తాబేళ్ల రక్షణకు ప్రత్యేక హేచరీలు

● జిల్లావ్యాప్తంగా 10 ఏర్పాటు : డీఎఫ్‌వో

నెల్లూరు(వెంకటేశ్వరపురం) మే 12 (ఆంధ్రజ్యోతి): అరుదైన ఓలీవ్‌రెడ్లీ తాబేళ్ల సంరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా 10 ప్రత్యేక హేచరీలను ఏర్పాటు చేసినట్లు డీఎఫ్‌వో మహబూబ్‌బాషా పేర్కొన్నారు. కావలి రేంజ్ పరిధిలోని సముద్రతీర ప్రాంతంలో సోమవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి తాబేళ్లను సముద్రంలో వదిలారు. అనంతరం మాట్లాడుతూ పది హేచరీల్లో 30వేల తాబేళ్ల గుడ్లను సంరక్షించామన్నారు. ఇప్పటి వరకు హేచరీల్లోని గుడ్లను కృత్రిమంగా పొదిగించి, 24,481 తాబేళ్లుగా మార్చి సముద్రంలో వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి రేంజర్ రామిరెడ్డి పాల్గొన్నారు.



కలుగోళ్ల శాంభవికి లక్ష మల్లెల పూజ

కావలి, మే 12(ఆంధ్రజ్యోతి): కావలి కలుగోళ్ల శాంభవి ఆలయంలో బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం 108 మంది ముత్తైదువులచే లక్ష మల్లెల పూజా జరిగింది. ఈ ఆలయాన్ని ఇటీవల దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లిన తర్వాత ఆలయ ఈవో ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలతో లక్ష మల్లెలపూజ తొలి కార్యక్రమంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ముత్తైదువులచే లక్షమల్లెల పూజా కార్యక్రమం చేట్టినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై

నేడు ధర్నా : ఎన్‌ఎంయూఏ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం (నేడు) చేపడుతున్న చలో డీపీటీవో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి టీ. మురళీమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు ప్రాంగణంలో ఉన్న ఎన్‌ఎంయూఏ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమయ్యాక వారిని అనేక సమస్యలు వెంటాడుతున్నాయని, సమస్యల పరిష్కారం కోసం పలు దఫాలుగా పోరాటాలు చేసినా, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం(డీపీసీవో) వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీని వాసరావు, రాష్ట్ర కార్యదర్శి అనీల్‌కుమార్ పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఉన్న ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సీహెచ్ చెంచురెడ్డి, పీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

మండే ఎండల్లోనూ వందల అర్జీలు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 387 వినతులు
● పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు
● అర్జీదారులకు మధ్యాహ్న భోజనం

నెల్లూరు (హరనాథపురం) మే 12 (ఆంధ్రజ్యోతి) : మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. జిల్లాలో సోమవారం 41 డిగ్రీల సెల్సియస్ ఎండ కాచింది. అయినా కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి 387 మంది వచ్చి అర్జీలు సమర్పించారు. ఇక్కడి తిక్కన ప్రాంగణం అర్జీదారులతో నిండిపోయింది. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయడంతో అర్జీదారులకు కొంతమేర ఉపశమనం లభించింది. కలెక్టర్ ఆనంద్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన వారు చెప్పినది ఓపిగ్గా విన్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. కాగా, సోమవారం వచ్చిన అర్జీల్లో ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 131, మున్సిపల్ శాఖవి 42, సర్వే శాఖవి 35, పంచాయతీరాజ్ శాఖకు చెందినవి 29, పోలీసుశాఖకు సంబంధించిన 62 ఉన్నాయి. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సమస్యలు పరిష్కరించాలి : జనసేన

నెల్లూరు నగరంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకుడు గునుకుల కిషోర్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నగరానికి ఏడు బాక్స్ టైప్ బ్రిడ్జిలు మంజూరై ఎనిమిదేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు నివారించేందు కు ఆ వంతెనలను వెంటనే నిర్మించాలని కోరారు.

దారి మూసేశారు

తన మామిడి తోటకు దారి ఇవ్వకుండా మూసేశారని బోగోలు మండలం ఎస్వీ పాలెం గ్రామస్థుడు ద్వారం వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తనకు సర్వే నెంబరు 88ల్లో 62 సెంట్ల భూమి ఇచ్చిందన్నారు. అందులో మామిడి చెట్లు సాగు చేశానన్నారు. ఇప్పుడు గ్రామానికి చెందిన ద్వారం శ్రీనివాసులు, నాగరాజమ్మ తోటకు వెళ్లడానికి దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. న్యాయం చేయాలని అభ్యర్థించారు.

పెన్షన్ ఇప్పించండి

వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీవాసి చెముడుగుంట వెంకట సుబ్బయ్య వినతిపత్రం ఇచ్చారు. 70 శాతం వైకల్యం ఉన్న తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని కోరారు.

ఉపాధి పథకంలో అక్రమాలు

ఉపాధి హామీ పథకం (నరేగా) పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కొప్పాల రఘు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరం సోషల్ ఆడిట్‌లో దాదాపు రూ.5కోట్లకుపైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఉపాధి హామీ పనుల అవినీతి అక్రమాల నివేదిక వెల్లడించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ గడువు పొడిగించండి

నెల్లూరు (వైద్యం) మే 12 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి అవసరమైన గడువు పెంచాలని కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్ సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అల్లావుద్దీన్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రెహమాన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గుర్తింపు లేకుండా, భవన నిర్మాణాలు పూర్తికాకుండా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షారూక్ కోరారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో డీఆర్‌వోకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నేతలు మస్తాన్, నవీన్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

శాక్సాఫోనే శ్వాసగా ముందుకు సాగుతూ పలువురి ప్రశంశలందుకుంటున్నారు కావలికి చెందిన తాళ్ళపాలెం సత్యనారాయణ(సత్యం). జిల్లాకు మొదటగా శాక్సాఫోన్ పరిచయం చేసిన ప్రముఖ విద్వాంసుడు తాళ్లపాలెం వెంకట సుబ్బయ్య, యానాదమ్మ దంపతుల కుమారుడు ఆయన. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఆలయాల్లో కచేరీలు చేసి ప్రజాప్రతినిధులు, అధికారుల మన్నన పొందారు

శాక్సాఫోనే శ్వాస!

● వాద్యంలో సత్యనారాయణ దిట్ట
● ఎన్నో ఆలయాల్లో కచేరీలు
● ప్రముఖుల ప్రశంసలు, పురస్కారాలు



కచేరీ చేస్తున్న సత్యనారాయణ

సత్యనారాయణకు చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో క్షౌర వృత్తి చేసుకుంటూ తండ్రి స్ఫూర్తితో శాక్సాఫోన్ వాద్యంలో నైపుణ్యం సాధించారు. సత్యాన్ని అతని చిన్నాన్న తాళ్లపాలెం మాల్యాద్రి చేరదీసి శాక్సాఫోన్ వాయించడంలో మెలకువలు నేర్పి ప్రోత్సహించారు. అనంతరం ప్రముఖ విద్వాంసుడు నడమనూరు నటరాజ వద్ద శిక్షణ పొంది విద్వాంసుడిగా ఎదిగారు. శిష్య బృందాన్ని ఏర్పరచుకుని వారితో కలిసి అనేక దేవాలయాల్లో కచేరీలు చేస్తున్నారు. కావలిలోని ప్రముఖ ఆలయాలైన కలుగోళ శాంభవి అమ్మవారి ఆలయం, శివాలయం, విష్ణాలయం, హనుమత్ క్షేత్రం, బృందా వనం కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కొండబిట్ర గుంట బిలకూట క్షేత్రం, నెల్లూరులోని పలు ఆలయాలు, శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సత్యం కచేరీలతో ప్రతిభను చాటారు.

● ప్రశంసలు... పురస్కారాలు

కావలిలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన శ్రీధర్, ఆర్డీవో శీనానాయక్ నుంచి ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్నారు. నెల్లూరు టౌన్‌హాల్‌లో సింహపురి సంస్కృతి సమాఖ్య వారు అందించిన ఉత్తమ కళాకారుడి పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి నుంచి అందుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి, మాజీ మంత్రి కాకాణి, ఎంపీలు బీఎమ్మార్, వేమిరెడ్డి, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ తదితరులతో శభాష్ అనిపించుకుని పురస్కారాలు, సత్కారాలు పొందారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

తగినంత ప్రోత్సాహం లేక యువత కళారంగం వైపు ఆసక్తి కనబరచడంలేదు. కళాకారులకు ప్రభుత్వాలు రాయితీలు, సంక్షేమ ఫలాలందించి ప్రోత్సహించాలి. తద్వారా కళను, కళాకారులను బతికించాలి.

- తాళ్ళపాలెం సత్యనారాయణ



మాజీ ఎమ్మెల్యే వంటేరు నుంచి పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ మృతి

వెంకటాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడు గుంట సమీపంలో ఉన్న జిల్లా కారాగారంలో సోమవారం రిమాండ్ ఖైదీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. ఎన్టీఆర్ జిల్లా మాచవరం ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్లా (41) సూర్యాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో గత ఏడాది ఏప్రిల్ 28 తేదీ నుంచి రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కాగా, సోమవారం ఉదయం 5.55 గంటల సమయంలో స్పృహ కో ల్పోయి పడిపోయాడు. దీంతో వెంటనే జైలు సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. జైలు సూపరిండెంట్ వెంకటేశ్వ రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్..

నెల్లూరు(క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్‌బ్రిడ్జిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందాడు. నార్త్‌ట్రాఫిక్ పోలీసుల సమా చారం మేరకు, కోవూరు మండలం చుండుగుంట గ్రామానికి చెంది న ఎస్ సాయి వెంకట ప్రతాప్(26) నగరంలోని పొగతోటలోగల విజయ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం స్కూటీపై ఇంటి నుంచి ల్యాబ్‌కు బయలుదేరాడు. ఆత్మకూ రు బస్టాండు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వస్తుండగా స్కూటీని ట్రాక్టర్ ఢీకొ నడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్‌ఐ జే. బలరామిరెడ్డి సంఘటనా స్థలా నికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షయ నివారణ చర్యలు తీసుకోండి

● రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ తహసినా

నెల్లూరు (వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ తహసినా ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని డామియెన్ ఫౌండేషన్ ఆసుపత్రిలో క్షయ నివారణపై సమీక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. క్షయ కేసులు ఎక్కడెక్కడ ఎక్కువగా ఉన్నాయి?, వారికి అందుతున్న వైద్య చికిత్సలు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు చికిత్సలతోపాటు మంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్ వలి, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ భవాని పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 79 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ ఎస్‌కు జిల్లావ్యాప్తంగా 79 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య వినతులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

● నెల్లూరుకి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో లలిత అనే మహిళ పరిచయమై ఫోరెక్స్ ట్రేడింగ్ కంపెనీలో డబ్బులు పెడితే అధిక ఆదాయం వస్తుందని నమ్మించింది. దీంతో అతను రూ.10.30 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయాడు. విచారించి న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశారు.

● సంగం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి, బుచ్చి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రఫీ, అతడి కుటుంబస భ్యులు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి పలుదఫాలుగా రూ.6 లక్షల వరకు నగదు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించలేదని, నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.



పీజీఆర్‌ఎస్ బయట నడవలేని మహిళ నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

● తన భర్త మరణించాడని, భర్త అన్న కుమారుడు రఫీ తాను నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని ఆత్మకూరుకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఖాళీ చేయకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని ఆమె కోరింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని జాతీయ రహదారి పై సోమవారం రాత్రి చోటుచేసు కుంది. వివరాలిలా ఉన్నాయి. కని యంపాడు గ్రామానికి చెందిన దొడ్ల మాధవ (38) వరికుంట పాడు నుంచి ప్రకాశం జిల్లా పామూరుకు మోటారుబైకుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఒకరికి గాయాలు



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రెండు కార్లు ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన సోమవారం విరువూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామం నుంచి హైదరాబాదు వెళ్తున్న కారు, విరువూరు నుంచి ప్రకాశం జిల్లా పామూరు వైపు వెళ్తున్న మరో కారు వేగంగా వెళ్తూ ఢీకొన్నాయి. దీంతో ఓ కారు రహదారి సమీపంలోని గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పెంచలోరి కల్యాణం.. మురిసిన భక్తజనం!

● కోనలో కనుల పండుగగా నృసింహుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

రాపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో నృసింహ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో కొలువు దీర్చి మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. ఈ సమయంలో ఒక్కసారిగా ప్రాంగణమంతా 'శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, గోవిందో... గోవిందా' అంటూ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం విశ్వక్సేన పూజ, కన్యాదానం నిర్వహించారు. శుభ ముహూర్తాన స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచి శా స్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ము క్కోటి దేవతలు వీక్షించే ఈ వేడుక ను సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే ముం దుండి జరిపిస్తున్నాడని అర్చకులు, భక్తులు తన్మయం చెందారు. ఈ శుభసమయాన కొత్త జంటలు కూ డా మూడు ముళ్ల బంధంతో ఒకటయ్యాయి. కాగా, ఉత్సవర్లకు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.



● రథంపై నూతన దంపతులు

రాత్రి ఏడు గంటలకు రథంపై స్వామి వారు ఉభయనాంచారులతో కలిసి కోన తిరువీధుల్లో విహరించారు. పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై కొత్త దంపతులు కొలువుదీరి కోన వీధుల్లో విహరించడం క్షేత్ర సంప్రదాయం. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు రథాన్ని లాగి తన్మయత్వం చెందారు. భక్తులు రథాన్ని లాగుతూ దివ్యనామస్మరణ చేశారు. అనంతరం గజ వాహన సేవ జరి గింది. ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసు లు రెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు, ఆల య ప్రధానార్చకులు పెంచలయ్యస్వా మి, సీతారామయ్య స్వామి, టీడీడీ పాం చరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు. కాగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందించారు.

● నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, స్నపన తిరుమంజనం జరగనుంది. రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వవాహనసేవ, 11 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.



కోనో శ్రీవారి కల్యాణం తిలకిస్తున్న భక్తజనులు, (ఇన్‌సెట్) ఎంపీ వేమిరెడ్డితో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



కల్యాణోత్సవానికి తరలివస్తున్న శ్రీవారు, భక్తజనం

భక్తులతో కిక్కిరిసిన వేదగిరి

● వేడుకగా శ్రీవారి కళ్యాణం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంసంధ్యవేళ వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహుడి కల్యాణం వేడుకగా జరిగింది. తొలుత వేకువజామున బంగారు గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన స్వామివారు పల్లకీ పై దేవరపాళెంలో విహరించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన స్వామి వారిని అలంకరణ మండపంలో పెళ్లికుమారిడిగానూ, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను పెళ్లికుమార్తెలగానూ అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు ఉత్సవర్లను తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు నేతృత్వంలోని అర్చక బృందం శాస్త్రోక్తంగా వివా హ తంతు నిర్వహించారు. ముందుగా బ్రహ్మోతవ కమిటీ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఈవో గోపి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, వాహనాలతో వేదగిరి క్షేత్రం సందడిగా మారింది. రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

● వేదగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దేరవపాళెంలో రథోత్సవం జరగనుంది.



గరుడ వాహనంపై నరసింహ స్వామి